PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 2 | విజయవాడ, శుక్రవారం 2 ఆగస్టు 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 2 August 2024 | Rs

ఎంత పెద్ద ఆపదొచ్చినా.. చదువులు ఆగకూడదు

- సహాయక శిబిరాలకు ఉపాధ్యాయులు
- వయనాడ్‌లో పినరయి పర్యటన
- అధికారులతో భేటీ, పార్టీలతో అఖిలపక్ష సమావేశం
- బాధిత ప్రాంతాల్లో రాహుల్, ప్రియాంక పర్యటన

6

సత్తాచాటిన స్వప్నిల్

- పొజిషన్-3 షూటింగ్‌లో కాంస్యం
- పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు మూడో పతకం

8

ఎస్సీ వర్గీకరణకు సుప్రీం అనుమతి

- రాష్ట్రాలు వర్గీకరించుకోవచ్చు
- మార్గదర్శకాలు తప్పనిసరి
- రాజ్యాంగ ధర్మాసనం మెజార్టీ తీర్పు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

షెడ్యూల్డు కులాల రిజర్వేషన్లలో వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. ఎస్సీలలో అత్యంత వెనుకబడిన సెక్షన్ల జీవితాలను మెరుగుపరచేందుకు ఈ సబ్ కోటా అవసరమని ప్రధాన న్యాయమూర్తి డి వై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యులతో కూడిన సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం గురువారం 6-1 తేడాతో ఇచ్చిన మెజార్టీ తీర్పులో స్పష్టం చేసింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ఉన్నారు. వీరిలో జస్టిస్ బేలా త్రివేది మెజార్టీ తీర్పుతో విభేధించారు. 2005లో ఇ వి చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో ఐదుగురు సభ్యులు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. ఎస్సీల్లో ఉప వర్గీకరణ అనుమతించబడదని ఆనాడు సుప్రీం ధర్మాసనం తీర్పు చెప్పింది. ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ప్రధానంగా రెండు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ తీర్పు వెలువరించింది. ఒకటి, ఎస్సీ రిజర్వేషన్లలో సబ్ కోటా అనుమతించబడుతుందా? రెండవది ఇ వి చిన్నయ్య వర్సెస్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం (2005) కేసులో తీర్పు సరైనదా? కాదా? వీటిపై విచారించిన రాజ్యాంగ ధర్మాసనం విచారణ అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 8న తీర్పును రిజర్వులో ఉంచి , ఇప్పుడు వెల్లడించింది. షెడ్యూల్డ్ కులాలు సజాతీయ తరగతి కాదని, వీరిలో అత్యంత వెనుకబడినవారికి ప్రయోజనాలు చేకూరేందుకు వారి జీవితం మెరుగుపడేందుకు సబ్ కోటాను అనుమతించవచ్చని చెప్పింది. షెడ్యూల్డ్ కులాల్లో సమానత్వ సాధనకు ఇదొక మార్గమని తెలిపింది.



ఎస్సీల్లో వివిధ సెక్షన్ల ప్రాతినిధ్యం తక్కువగా ఉందని అనుభవ పూర్వక సాక్ష్యాలున్నాయని, వాటి ఆధారంగానే రిజర్వేషన్లలో రిజర్వేషన్లు ఉండాల్సిన అవసరముందని తాము అభిప్రాయపడుతున్నామని రాజ్యాంగ ధర్మాసనం వివరించింది. ఎస్సీల్లో సబ్ కోటా రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వం)ను ఉల్లంఘించదు. కులాన్ని ఉప వర్గీకరించేందుకు నిరోధించేది ఏదీ ఆర్టికల్ 15, 16లో లేదు. అందుకే 2005 నాటి ఇ వి చిన్నయ్య తీర్పును మేం వ్యతిరేకిస్తున్నామని ధర్మాసనం తెలిపింది. . . . రాష్ట్రాలు ఉప వర్గీకరణ చేసుకునేందుకు అనుమతి ఇస్తున్నాం. అయితే, ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను నిర్దిష్టంగా రూపొందించాలని కోర్టు సూచించింది. మధ్యప్రదేశ్‌లో 25 కులాల్లో తొమ్మిది మాత్రమే షెడ్యూల్ కులాలు. కాబట్టి రాష్ట్రాలు వివక్ష, వెనుకబాటుతనం విభిన్న స్థాయిలను పరిగణనలోకి తీసుకుని . షెడ్యూల్డు కులాల్లో బాగా వెనుకబడిన సెక్షన్లకు ప్రయోజనం చేకూరేలా చూడాలి. ఇది ఎస్సి, ఎస్‌టిల ఉప వర్గీకరణ చేసే హక్కు రాష్ట్రపతికి కల్పించే ఆర్టికల్ 341 (2)ను ఉల్లంఘించదు. రాష్ట్రపతి నోటిఫై చేసిన షెడ్యూల్ కులాలు భిన్నమైన వర్గాలనే చారిత్రక ఆధారాలను నిర్ధారించాం.

ఎస్‌సిలకు క్రీమీలేయర్ : జస్టిస్ గవాయ్

అసమానుల మధ్య సమానత్వం అన్న అంశంపై న్యాయస్థానం కేంద్రీకరించిందని జస్టిస్ బిఆర్ గవాయ్ పేర్కొన్నారు. సంపన్న వెనుకబడిన తరగతులకు కోటా ప్రయోజనాలను కొనసాగించడం రిజర్వేషన్ ఉద్దేశ్యాన్నే దెబ్బతీస్తుందని అన్నారు. ఎస్‌సిల్లో కూడా క్రీమీలేయర్‌ను గుర్తించే విధానాన్ని రాష్ట్రాలు రూపొందించాలని జస్టిస్ గవాయ్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. రిజర్వేషన్లు ఒక కుటుంబంలో ఒక తరానికి మాత్రమే పరిమితం చేయాలని, కోటా ప్రయోజనాలను ఏ తరం అయినా సద్వినియోగం చేసుకుంటే, తరువాత తరానికి రిజర్వేషన్లు అందుబాటులోకి రాకూడదని ప్రతిపాదించారు.

జస్టిస్ బేలా ఎం.త్రివేది అసమ్మతి

రాజ్యాంగ ధర్మాసనంలోని జస్టిస్ బేలా ఎం.త్రివేది భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎస్‌సి, ఉప కులాల వర్గీకరణను రాజ్యాంగ ధర్మాసనంలోని మెజారిటీ సభ్యులు సమర్థించగా.. జస్టిస్ బేలా త్రివేది మాత్రం వ్యతిరేకించారు. ఉప వర్గీకరణ అనుమతించకూడదని పేర్కొన్నారు. ఎస్‌సిల్లోని మిగతా 7లో

మడకశిర మండలం గుండుమల గ్రామంలో రామన్నకు పింఛను అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అన్నదాతలను ఆదుకుంటాం

- హంద్రీనీవా పూర్తి చేస్తాం : సిఎం చంద్రబాబు
- మడకశిర నియోజకవర్గంలో ఇంటికెళ్లి పింఛను పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రైతులను ఆదుకుంటామని, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పిఒ) ద్వారా రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని, డ్రిప్ పరికరాలను సబ్సిడీతో అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీనిచ్చారు. 'మేము పాలకులం కాదు... సేవకులం... ఎక్కడా హంగామా ఉండదు... ప్రజలకు మంచి చేయడానికే అధికారాన్ని ఉపయోగిస్తాం.' అని అన్నారు. ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛను పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం సత్యసాయి జిల్లా మడకశిర మండలం గుండమల గ్రామంలో పర్యటించి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. రామన్న అనే వ్యక్తి ఇంటికెళ్లి వృద్ధాప్య పింఛను అందివ్వగా, ఓబుళమ్మకు వితంతు పింఛను అందజేశారు. రామన్న, ఓబుళమ్మతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం గుండుమల గ్రామంలో ప్రజావేదిక నిర్వహించారు. పింఛను లబ్ధిదారులతో సిఎం ముఖాముఖి నిర్వహించారు. పట్టు రైతులకు, రీలర్లకు అంతకు మునుపు ఇచ్చే సబ్సిడీ గడిచిన ఐదేళ్లుగా ఇవ్వడం లేదని ముఖ్యమంత్రి దృష్టికి పట్టు రైతు రంగనాథ తీసుకొచ్చారు. మల్బరీ షెడ్డు నిర్మాణానికి కొన్ని నిబంధనలు ఇబ్బందికరంగా ఉన్నాయని, వాటిని మార్చాలని ముఖ్యమంత్రిని హిందూపురం ఎంపి బికె.పార్థసారథి కోరారు. వక్క రైతులు తమ సమస్యలను సిఎంకు వివరించారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా వక్క పంట ఇక్కడ ఉందని, మార్కెటింగ్ సౌకర్యం స్థానికంగా లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెటింగ్ సౌకర్యంతోపాటు, డ్రిప్ సబ్సిడీ అందివ్వాలని కోరారు. అనంతరం ప్రజలనుద్ధేశించి మిగతా 2లో

5, 6 తేదీల్లో కలెక్టర్ల కాన్ఫరెన్స్

2

హిమాచల్‌లో కుంభవృష్టి

- ముగ్గురు మృతి, 50 మంది పైగా గల్లంతు

5

లోపలి పేజీలో

- 'సుప్రీం' తీర్పును స్వాగతిస్తున్నాం : ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఎస్సీల్లో వెనుకబడిన సెక్షన్లకు మేలు చేకూర్చేలా చర్యలు : సిపిఎం
- మార్గదర్శకాలు వచ్చే వరకు ఉద్యోగ నియామకాలు చేయొద్దు : ఎంఆర్‌పిఎస్

నాగార్జునసాగర్‌కు భారీ వరద

- 540 అడుగులకు చేరిన నీటిమట్టం - నేడు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కృష్ణా బేసిన్ ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. గతేడాది ఈ సమయంలో వెలవెలబోయిన ప్రాజెక్టులు ఈ సంవత్సరం వర్షాకాల ఆరంభంలోనే గరిష్ట స్థాయి నీటిమట్టాలకు చేరుకున్నాయి. తెలుగు రాష్ట్రాల రైతాంగానికి ప్రధాన సాగునీరు వనరైన నాగార్జున సాగర్‌లోకి గత నాలుగు రోజుల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువన ఉన్న జూరాల, తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టులు నిండటంతో వరదనీటిని దిగువకు వదులుతున్నారు. జూరాల నుంచి మూడు లక్షలు, తుంగభద్ర నుంచి రెండు లక్షల క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలంలోకి కొనసాగుతోంది. వరద ప్రవాహాన్ని అంచనావేసిన అధికారులు గురువారం శ్రీశైలం నుంచి ఐదు లక్షల క్యూసెక్కుల నీటిని సాగర్‌లోకి వదులుతున్నారు. నాగార్జున సాగర్ గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 185 టిఎంసిల నిల్వతో 540 అడుగుల నీటిమట్టానికి చేరుకుంది. శుక్రవారం సాయంత్రం నాగార్జున సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయాలని తెలంగాణ ఇరిగేషన్ అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు దిగువన ఉన్న ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. సాగర్ నుంచి నీటి విడుదలతో ప్రస్తుతం డెడ్ స్టోరేజ్ ఉన్న పులిచింతల జలకళ సంతరించుకోనుంది.

సుప్రీం తీర్పును సమర్థిస్తున్నాం: బి వెంకట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును సమర్థిస్తున్నామని ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ తెలిపారు. గురువారం నాడిక్కడ ఎపి, తెలంగాణ భవన్‌లో బి వెంకట్ మీడియాతో మాట్లాడారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నటువంటి ఉప కులాల వర్గీకరణ సమస్యపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తున్నామని తెలిపారు. ఎస్‌సి వర్గీకరణ జరిగినప్పుడు గతంలో తాము మద్దతు ఇచ్చామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు ఆదేశాలను అమలుపరిచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, జాప్యం చేయొద్దని కోరుతున్నామని అన్నారు. ప్రభుత్వ రంగమంతా ప్రైవేట్ పరం చేయడమే ప్రధాన పనిగా కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పెట్టుకుందని విమర్శించారు. ప్రభుత్వ రంగంలో ఉన్న వేలాది ఉద్యోగాలు రద్దయిపోతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు అవసరమని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు జరగాలంటే కేంద్ర ప్రభుత్వం తక్షణం ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

భూ కబ్జాలపై అధిక ఫిర్యాదులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
జనసేన కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి రాష్ట్ర వ్యాప్తంగా భూ కబ్జాలపై పెద్దయెత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రజల నుంచి ఫిర్యాదులను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ స్వీకరించారు. పల్నాడు జిల్లా కనమల చెరువు గ్రామానికి చెందిన కె సాల్మన్ అనే కార్మికుడు తన భూమిని వైసిపి నేతల అండతో కబ్జా చేశారంటూ ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం హరిశ్చంద్రాపురానికి చెందిన సనక అరుణశ్రీ అనే యువతి తన పేరున ఉన్న వ్యవసాయ భూమిని రికార్డుల్లో నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా మార్చేశారని, దీనిపై రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డుల్లో వేర్వేరు పేర్లు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. ఏలూరు జిల్లా విజయరాయి గ్రామానికి చెందిన యువకులు తమ్మిలేరుపై బలివే వంతెన నిర్మాణాన్ని మధ్యలో నిలిపేశారని, ఆ నిర్మాణం పూర్తి చేయించాలంటూ వినతిపత్రం అందజేశారు. కళాశాలలో చదువుతున్న తన కుమార్తె ఫీజు చెల్లించలేకపోయానని, అక్కడ సర్టిఫికెట్స్ ఇప్పించాలని బి లీలారాణి ఫిర్యాదు చేశారు.

వేతన బకాయిలు చెల్లించాలి

- ఎపి 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల వేతన బకాయిలు చెల్లించాలని ఎపి 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్‌లో డ్రైవర్లకు కేవలం రూ.9,300 ఇస్తున్నారని అన్నారు. తక్కువ వేతనమైనా ప్రభుత్వం వేతనాలివ్వడం లేదన్నారు. డ్రైవర్లకు నాలుగు నెలలుగా వున్న బకాయిలను తక్షణం విడుదల చేయాలని కోరారు. తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులందరికీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల తరహాలో వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. అలాగే డ్రైవర్లందరినీ ఆప్కాస్‌లో చేర్చాలని కోరారు.

మైనింగ్ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి సస్పెన్షన్

- ఎసిబి విచారణకు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్ర మైనింగ్ శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డిపై ఎసిబి విచారణకు ఆదేశించడంతో పాటు సస్పెన్షన్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గురువారం జీఓ ఎంఎస్ నెంబర్ 61ని విడుదల చేసింది. వెంకటరెడ్డి అక్రమాలపై శాఖాపరంగా విచారణ చేసి నివేదికను ఎసిబికి పంపింది. 2021-24 మధ్య కాలంలో గనులు , ఇసుక తవ్వకాల్లో అక్రమాలు చేశారని, సుప్రీంకోర్టు, ఎన్‌జిటి ఆదేశాలను బేఖాతరు చేశారనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయి.

'పర్స' జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

పర్స శతజయంతి సభలో మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
కార్మికోద్యమ నేత పర్స సత్యనారాయణ జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని, కడ వరకు ఉద్యమాలకు ఊపిరి పోశారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. కార్మిక నేత, సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు, సిపిఎం రాష్ట్ర నాయకులు పర్స సత్యనారాయణ శత జయంతి సభ గురువారం పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరిగింది.

సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయ నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో పర్సా సత్యనారాయణ చిత్రపటానికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శులు కె.ధనలక్ష్మి, ముజఫర్ అహమ్మద్ పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. 1962లో ఎమ్మెల్యేగా ఎన్నికైన పర్స విశాఖ ఉక్కు నిర్మాణం కోసం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉద్యమబాట పట్టారన్నారు. నైజాం నవాబులకు, పటేల్, పట్వారీలకు వ్యతిరేకంగా పుచ్చలపల్లి సుందరయ్య, బసవ పున్నయ్య, చండ్ర రాజేశ్వరరావు చేపట్టిన తెలంగాణ సాయుధ పోరాటానికి కొత్తగూడెం ప్రాంతంలో నాయకత్వం వహించారని గుర్తు చేశారు. నాడు నైజాం నవాబుల కింద ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోశారని తెలిపారు. సభలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంత్ రెడ్డి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి శివకుమారి, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధ చర్యలు విడనాడండి

- అరెస్టులను ఖండించిన సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా సిపిఎం నాయకుల అరెస్టును ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ఖండించింది. పెనుకొండ, మడకశిర ప్రాంతాల్లో సిపిఎం నాయకులు, ప్రజా సంఘాల ముఖ్య కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పింఛన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా అకారణంగా సిపిఎం, ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచారని అన్నారు. ఎటువంటి ఆందోళనా కార్యక్రమాలకూ తమ పార్టీ పిలుపునివ్వలేదని, అయినా గురువారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న నాయకులు పెద్దన్న, రమేష్, గంగాధర్, వెంకట్రాముడును అరెస్టు చేసి పెనుకొండ పోలీస్ స్టేషన్‌లో పెట్టారని తెలిపారు. మడకశిరలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వీరేష్‌ను గృహ నిర్బంధం చేశారని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వంలోనూ ముఖ్యమంత్రి ఏ జిల్లా పర్యటనకు వస్తే, అక్కడి వామపక్ష పార్టీల నాయకులను, ముఖ్యంగా తమ పార్టీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడంతోపాటు ఉద్యమాల పట్ల నిరంకుశంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ నిరంకుశ అప్రజాస్వామిక చర్యలను ఎన్నికల్లో ప్రజలు నిరసించారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ పద్ధతులను విమర్శించి అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఇదే నిర్బంధ చర్యలను కొనసాగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలని కోరారు. అరెస్టు చేసిన సిపిఎం నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మమ్మల్ని మన్నించండి కామ్రేడ్

- సిపిఎం నాయకుల అరెస్టుపై మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'మమ్మల్ని మన్నించండి కామ్రేడ్' అంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మడకశిర నియోజకవర్గం పర్యటన సందర్భంగా ఆ ప్రాంత సిపిఎం నేతలను పోలీసులు అరెస్టు చేసిన ఘటనపై లోకేష్ వైవిధంగా సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్)లో గురువారం స్పందించారు. గృహ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులకు తమ కూటమి ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకమని తెలిపారు. గత ఐదేళ్ల పరదాల ప్రభుత్వం పోయినా ఇంకా కొంతమంది పోలీసుల తీరు మారలేదని పేర్కొన్నారు. ఇటువంటి అప్రజాస్వామిక అరెస్టులను పునరావృతం కానివ్వం అని వెల్లడించారు. ప్రభుత్వాన్ని ప్రజాపక్షమై ప్రశ్నించే హక్కు, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కులను కాపాడతామని హామీ ఇచ్చారు. ఇకపై ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు వంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్‌శాఖ ముఖ్య అధికారులను కోరుతున్నట్లు తెలిపారు.

ఎస్‌సి వర్గీకరణపై 'సుప్రీం' తీర్పును స్వాగతిస్తున్నాం

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం ధర్మాసనం తీర్పును స్వాగతిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో సుప్రీంకోర్టు తీర్పుపట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం ఆయన ట్వీట్ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అన్ని తరగతులకూ సమన్యాయం జరగాలని 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ వేసి దేశంలోనే మొదటిసారి ఎస్‌సి వర్గీకరణపై ముందడుగు వేసిందని తెలిపారు. సామాజిక న్యాయం గెలవాలనేది టిడిపి సిద్ధాంతమని, అత్యంత నిరుపేదలకు ఫలాలు అందించేందుకు వర్గీకరణ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. దళితులు ఐక్యంగా వుండి అభివృద్ధి సాధించాలని, ఆర్థికంగా సామాజికంగా వారి జీవితాల్లో వెలుగులు రావాలని ట్వీట్‌లో కోరారు.

ఎస్‌సిల అభ్యున్నతికి తోడ్పడాలి : వైసిపి
సుప్రీంకోర్టు తీర్పు షెడ్యూల్డ్ తరగతుల అభ్యున్నతికి తోడ్పడాలనేది వైసిపి లక్ష్యమని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆకాంక్షించారు. ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును అవకాశవాద రాజకీయాలకు వినియోగించకుండా.. అందరికీ న్యాయం జరిగేలా వుండాలన్నారు.

'సుప్రీం' తీర్పు హర్షణీయం
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ
'దశాబ్దాల నిరీక్షణ తర్వాత ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. 2004లో జస్టిస్ చిన్నయ్య ఇచ్చిన జడ్జిమెంట్‌ను సుప్రీం ధర్మాసనం పక్కన బెట్టి వర్గీకరణను సమర్థిస్తూ తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాం' అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పేర్కొన్నారు.

వర్గీకరణను అమలు చేయాలి : కెవిపిఎస్
ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మల్యాద్రి ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వున్న ఉద్యోగుల లెక్కలు తీసి వర్గీకరణను అమలు చేయాలన్నారు. ఉపకులాల్లో వెనుకబాటు తనాన్ని నిర్మూలించేందుకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

నిరంతర పోరాటానికి దక్కిన ఫలితం : పవన్‌కల్యాణ్
ఎస్‌సి వర్గీకరణపై నిరంతర పోరాటానికి దక్కిన ఫలితమే సుప్రీంకోర్టు తీర్పు అని ఉప ముఖ్యమంత్రి, జనసేన చీఫ్ పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎబిసిడి వర్గీకరణ కోసం మాదిగలు దశాబ్దాలపాటు పోరాటం చేశారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి వర్గీకరణ సాధించేందుకు పోరాడిన మందకృష్ణకు అభినందలు తెలియజేశారు.

మాదిగలకు శుభపరిణామం : పురందేశ్వరి
ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు మాదిగలకు శుభపరిణామం అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ఎంపి పురందేశ్వరి అన్నారు. అన్ని తరగతులకూ సమన్యాయం జరగాలని వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేసిన పోరాటానికి నరేంద్ర మోడీ అండగా నిలిచారన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై మంత్రులు నారా లోకేష్, బిసి జనార్ధన్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మార్గదర్శకాలు వచ్చే వరకు ఉద్యోగ నియామకాలు చేయొద్దు : ఎంఆర్‌పిఎస్
న్యూఢిల్లీ బ్యూరో : ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా మార్గదర్శకాలు వచ్చే వరకు తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగాల నియామకం చేయొద్దని ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో గురువారం నాడిక్కడ మందకృష్ణ మాదిగ మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తాజా తీర్పును తెలుగు రాష్ట్రాల్లో విద్య, ఉద్యోగ నియామకాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల దగ్గర ఎస్‌సి, ఎస్‌టి జనాభా లెక్కలు ఉన్నాయని, ప్రస్తుతం ఉన్న ఉద్యోగ నియామకాల్లోనూ అమలు చేయాలని డిమాడ్ చేశారు.

ఎస్‌సి వర్గీకరణను స్వాగతిస్తున్నాం : సిపిఐ
ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. గురువారం నాడిక్కడ స్థానిక ఎపి, తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మాదిగలకు అన్యాయం జరిగిందనేది వాస్తవమని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అంతర్యుద్ధాన్ని అనుమతించం

- మదురో స్పష్టీకరణ

కారకస్: యునైటెడ్ సోషలిస్టు పార్టీ ఆఫ్ వెనిజులా (పిఎస్‌యువి)కి చెందిన 3,600 మంది నాయకులపై ఫాసిస్టు మూకలు దాడికి పాల్పడడంపై అధ్యక్షుడు మదురో ఆగ్రహం వ్యక్తం చేశారు. హింస, విధ్వంసంతో దేశంలో అంతర్యుద్ధాన్ని సృష్టించాలని చూస్తే సహించేది లేదనిహెచ్చరించారు. దేశంలో హింస, అరాచకాలకు పాల్పడుతున్న అల్లరి మూకలను మేరియా కోరినో మచాడే, గొంజాలెజ్ ఎగదోస్తున్నారని ఆయన అన్నారు. "ప్రతిదీ రాజ్యాంగ బద్ధంగా ఉండాలని మేము కోరుకుంటున్నాం. మేము ఇతర విప్లవ రూపాల్లోకి వెళ్లాలనుకోవడం లేదు. మేము హ్యూగో చావెజ్ నిర్దేశించిన మార్గంలోనే కొనసాగాలనుకుంటున్నాం" అని మదురో ఉద్ఘాటించారు. అయితే అమెరికన్ సామ్రాజ్యవాదం, ఫాసిస్టు నేరగాళ్లు మమ్మల్ని కవ్వించాలని చూస్తే వెనిజులా ప్రజలు మరో విప్లవానికి సిద్ధమవుతారని ఆయన హెచ్చరించారు. మదురో బుధవారం నాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఫాసిస్టు శక్తులు ఏర్పాటు చేసిన కమాండిటోలు హింస ద్వారా దేశంలో శాంతి క్రమాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని, ఇటువంటి యత్నాలను ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించబోమని అన్నారు.

'ఉక్కు'ను నిర్వీర్యం చేయడం దారుణం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు, వర్కింగ్ క్యాపిటల్ కేటాయించకుండా నిర్వీర్యం దిశగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1267వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి స్టీల్‌ప్లాంట్ విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిస్థితిపై కార్మికులంతా ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఉక్కు పరిరక్షణ అంశం ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు. ఉత్పత్తిని దారుణంగా దెబ్బతీసి నష్టాల వైపు నడిపిస్తున్న స్టీల్‌ప్లాంట్ యాజమాన్య వైఖరిని ఖండించారు. ప్లాంట్‌ను రక్షించుకునేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మోడీ సర్కారుపై ఒత్తిడి తేవాలన్నారు. దీక్షల్లో దొమ్మతి అప్పారావు, విళ్లా రామ్మోహన్ కుమార్, శ్రీనివాసనాయుడు, కెఎస్ఎన్.రావు, మసేన్‌రావు, జయ, నాయుడు, దేముడు, కనకరాజు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

- అధికారులకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ నెల 15న విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ వేడుకల నిర్వహణకు సంబంధించి ఆయా శాఖల పరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లన్నీ పటిష్టంగా చేయాలని ఆదేశించారు. అదేరోజు సాయంత్రం రాజ్‌భవన్‌లో జరిగే ఎట్‌హోం కార్యక్రమానికి కూడా తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రొటోకాల్ విభాగం, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరు, విజయవాడ మున్సిపల్ కమిషనరు మొత్తం ఏర్పాట్లను సంబంధిత శాఖలను సమన్వయం చేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహనకు ఆయా శాఖల వారీ ప్రత్యేక శకటాల ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. సాధారణ పరిపాలన (పొలిటికల్)శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ వివిధ శాఖల వారీ చేపట్టాల్సిన ఏర్పాట్లపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. వేడుకలకు పోలీస్‌శాఖ తరపున విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేస్తామని సమావేశానికి వర్చువల్‌గా పాల్గొన్న శాంతిభద్రతల ఐజి శ్రీకాంత్ చెప్పారు. ఈ సమావేశంలో వర్చువల్‌గా ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ సృజన, ప్రొటోకాల్ డైరెక్టరు బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, సమాచార, పౌరసంబంధాలశాఖ సంయుక్త సంచాలకులు పి కిరణ్, అగ్నిమాపక విభాగం డైరెక్టరు మురళి పాల్గొని ఏర్పాట్ల గురించి వివరించారు.

గిరిజన గ్రామ పంచాయతీ సమావేశాల్లో సికిల్‌సెల్ ఎనీమియాపై చర్చ

- ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు హరికిరణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
గిరిజన గ్రామ పంచాయతీ సమావేశాల్లో సికిల్‌సెల్ ఎనీమియాపై చర్చించాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ హరికిరణ్ పేర్కొన్నారు. గిరిజన గ్రామ పంచాయతీల సమావేశం అజెండాలో సికిల్‌సెల్ ఎనీమియా అంశం చేర్చాలని, ఇందుకోసం గిరిజన సంక్షేమశాఖ ఉన్నతాధికారుల్ని సంప్రదించాలని తెలిపారు. జాతీయ సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలన మిషన్‌పై మంగళగిరి ఎపిఐఐసి టవర్స్‌లోని వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా సికిల్ సెల్ ఎనీమియా బాధితుల్ని స్క్రీనింగ్ చేయాలని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని హరికిరణ్ ఆదేశించారు. సంబంధిత ఐటిడిఎ పిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 5, 6 తేదీల్లో రాష్ట్రస్థాయి జిల్లా కలెక్టర్ల సమావేశంలో సికెల్‌సెల్ ఎనీమియాను నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో జీరో నుంచి 40 ఏళ్ల మధ్య వయసు ఉన్న 19,90,277 బాధితుల్ని మూడేళ్లలో రాష్ట్రంలో స్క్రీనింగ్ చేయాలని కేంద్రం లక్ష్యాన్ని నిర్ణయించిందన్నారు. ఇప్పటి వరకు 8,80,560 మందికి స్క్రీనింగ్ చేశారని తెలిపారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ మార్గదర్శకాల ప్రకారం స్క్రీనింగ్ చేసిన ప్రతి వ్యక్తికి సికిల్‌సెల్ స్టేటస్ ఐడి కార్డును జారీ చేస్తారని తెలిపారు. 2,85,397 మందికి ఈ కార్డుల్ని త్వరలో జారీ చేస్తారన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు ఉచితంగా రక్తాన్ని అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నేషల్ హెల్త్ మిషన్ పిఎ డాక్టర్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా గన్నవరంలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

వయనాడ్ విపత్తు బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - గన్నవరం (కృష్ణా జిల్లా)
కేరళ వయనాడ్ విపత్తు బాధితులను ఆదుకోవాలని కోరుతూ కృష్ణా జిల్లా గన్నవరంలో గురువారం సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ప్రజల నుంచి స్పందన లభించింది. రూ.15,980 విరాళాలుగా అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లం వెంకటేశ్వరరావు, టివి.లక్ష్మణ స్వామి, మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో కలెక్టర్ల కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో తెలుగు దేశం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటిసారి జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమావేశం కానున్నారు. ఈ నెల 5, 6 తేదీల్లో ఈ సమావేశాన్ని రాష్ట్ర సచివాలయంలోని ఐదవ బ్లాక్‌లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలు ఉదయం 10గంటల నుండి సాయంత్రం 6గంటలకు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి రోజున జిల్లా కలెక్టర్లతోనే సమావేశం ఉంటుందని, రెండో రోజు ఎస్‌పిలతో కలిసి సమావేశం వుంటుందని వివరించారు. ఈ సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులకు ఆహ్వానాలను పంపుతున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా కలెక్టర్, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్, సిసిఎల్‌ఎ అదనపు కమిషనర్ సమావేశాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

మమ్మల్ని ఆదుకోండి

- టిడిపి గ్రీవెన్స్‌లో మీసేవా నిర్వాహకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
'మమ్మల్ని ఆదుకోండి' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని మీసేవా కేంద్రాల నిర్వాహకులు కోరారు. టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం గురువారం జరిగింది. టిడిపి ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి.. ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. వైసిపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 50 వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని మీసేవా నిర్వాహకులు తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం తమకు భరోసా కల్పించాలని కోరారు. రాష్ట్రంలో భూ అక్రమాలు పెరిగాయని, భూ హక్కుదారులకు తెలియకుండానే మరొకరి పేరుమీదకు మార్చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. నామినేటెడ్ పదవుల కోసం పార్టీ నేతలు అర్జీలు అందించారు.

ప్రజా శ్రేయస్సు కోసమే.. : దేవినేని, రాంభూపాల్
టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు కోసమే పనిచేస్తోందని దేవినేని ఉమామహేశ్వరరావు, రాంభూపాల్ రెడ్డి చెప్పారు. టిడిపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఒక్క రోజులోనే ఉదయం 10 గంటలకు 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందన్నారు. గ్రీవెన్స్‌కు వస్తున్న అర్జీదారులలో ఎక్కువ మంది మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బాధితులేనని పేర్కొన్నారు. ఈ అర్జీలను సంబంధిత అధికారులు, శాఖలకు పంపి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. మాజీ సిఎం వైఎస్ జగన్ కుట్రపూరిత రాజకీయాలకు స్వస్తి పలకాలన్నారు.

టిడిపి కార్యాలయంలో వర్ల జన్మదిన వేడుకలు
టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య జన్మదిన వేడుకలు టిడిపి కార్యాలయంలో జరిగాయి. టిడిపి ఎస్‌సి సెల్ ఆధ్వర్యాన ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి పేదలకు ఆర్థికసాయం కింద చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంభూపాల్ రెడ్డి, దేవినేని ఉమా, ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు కోడూరు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌సి నివేదికపై సవాల్ చేసుకోవచ్చు

- పొన్నవోలుకు హైకోర్టు సూచన

ప్రజాశక్తి-అమరావతి
ప్రాణహాని లేదంటూ సెక్యూరిటీ రివ్యూ కమిటీ (ఎస్‌ఆర్‌సి) ఇచ్చిన నివేదికను సవాల్ చేసుకోవచ్చునని మాజీ అదనపు ఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి హైకోర్టు సూచించింది. ఆ నివేదికను పిటిషనర్‌కు అందజేయాలని హోంశాఖను ఆదేశించి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. అప్పటి వరకు పొన్నవోలుకు గతంలోని భద్రతను కొనసాగించాలని జస్టిస్ బివిఎల్ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో తనకున్న 2 ప్లస్ 2 భద్రతను యథాతథంగా కొనసాగించేలా ఆదేశాలివ్వాలని పొన్నవోలు పిటిషన్‌లో హైకోర్టును కోరారు. కమిటీ రిపోర్టును సవాలు చేసే వరకు పిటిషనర్‌కు 2 ప్లస్ 2 భద్రతను కొనసాగించాలని ఆదేశించింది.

వివేకా కేసులో రాంసింగ్ క్వాష్ పిటిషన్‌పై విచారణ 12కి వాయిదా
మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో గత సిబిఐ దర్యాప్తు అధికారి రాంసింగ్ వేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ ఈ నెల 12కి వాయిదా వేస్తూ జస్టిస్ వి.జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వివేకా హత్య కేసును తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను, ఫిర్యాదుదారు గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డి బెయిల్ మంజూరుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించిన ఉత్తర్వులను తమ ముందుంచాలని రాంసింగ్‌ను ఆదేశించారు. వివేకా హత్య కేసులో తప్పుడు సాక్ష్యం ఇవ్వాలని రాంసింగ్ బెదిరిస్తున్నారని పులివెందులకు చెందిన గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి కడప జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన మేజిస్ట్రేట్ కోర్టు, ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపిన నివేదిక ఇవ్వాలని కడప రిమ్స్ పోలీసులను ఆదేశించింది. ఆ తర్వాత రాంసింగ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని కొట్టేయాలంటూ రాంసింగ్ వేసిన క్వాష్ పిటిషన్‌పై లోతుగా విచారణ చేస్తామని హైకోర్టు ప్రకటించింది.

అన్నదాతలను ఆదుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

సిఎం మాట్లాడుతూ... గడిచిన ఐదేళ్లలో నియంత పాలన సాగిందన్నారు. అన్నింటిల్లోనూ విధ్వంసమే జరిగిందని విమర్శించారు. తాము పాలకులం కాదని..సేవకులమని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అధికారంలో ఉన్న వారు నియంతలుగా వ్యవహరించారని దుయ్యబట్టారు. ప్రజాధనాన్ని విలాసాలకు ఖర్చు పెట్టారన్నారన్నారు. సర్వే రాళ్లకు తమ ఫొటోలను వేసుకోవడానికి ప్రత్యేకంగా రూ.700 కోట్లు ఖర్చు పెట్టారని విమర్శించారు. విశాఖపట్నంలో విలాసవంతమైన భవనం కోసం రూ.500 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. వాస్తవాలు తెలియాలనే ఏడు శ్వేతపత్రాలను విడుదల చేశామన్నారు. తాము అధికారంలోకి వచ్చేసరికి ఖజానా ఖాళీ చేశారని తెలిపారు. అయినా అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. హంద్రీనీవాను పూర్తి చేస్తామని హామీనిచ్చారు. జోరు వర్షంలోనూ ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, మడకశిర ఎమ్మెల్యేలు ఎంఎస్.రాజు, కాలవ శ్రీనివాసులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కలెక్టర్ టిఎస్.చేతన్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నాయకుల ముందస్తు అరెస్టులు
కూటమి ప్రభుత్వంలోనూ ప్రశ్నించే నాయకుల గొంతు నులిమే చర్యలు ఆగడం లేదు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సత్యసాయి జిల్లా వ్యాప్తంగా సిపిఎం, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు ఎక్కడెక్కడ నోటీసులు ఇచ్చి గృహ నిర్బంధం చేశ్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సోమందేపల్లి సిపిఎం మండల కమిటీ సభ్యులు రమేష్, గంగాధర్ తదితరులను తెల్లవారుజామున 3.30 గంటలకు పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసేంత వరకు స్టేషన్‌లో ఉంచుకుని తర్వాత వదిలేశారు..

పెద్దిరెడ్డే లక్ష్యంగా కుట్రలు

- మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మదనపల్లె సబ్ కలెక్టరు కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదం కేసు పక్కదారి పట్టిందని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. వాస్తవాలు తెలుసుకోకుండా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని లక్ష్యంగా చేసుకుని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తాడేపల్లిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రమాదం జరిగినప్పుడు గౌతం అనే టిడిపి సానుభూతి పరుడు అక్కడే వున్నాడని అన్నారు. ప్రమాదం జరిగితే ప్రమాదంగా చూడకుండా కుట్ర కోణంలో విచారణ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆర్‌డిఒ కార్యాలయంలో ఫైళ్లు దగ్ధమైతే అవే ఫైళ్లు తహశీల్దారు, కలెక్టరు కార్యాలయాల్లో వుంటాయని అన్నారు. ఈ కేసుతో ముడిపడి ఎనిమిది కేసులు వున్నాయని కర్నూలు రేంజ్ డిఐజి చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. ఆ ఎనిమిది కేసులు ఏమిటి? ఎవరిమీద పెడుతున్నారు? అనే అంశం మదనపల్లెలో చర్చనీయాంశంగా మారిందన్నారు. పెద్దిరెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి కుట్ర కేసులో ఇరికించేందుకు టిడిపి ప్రయత్నిస్తోందని విమర్శించారు.

వాసుదేవరెడ్డికి నోటీసులు

హైకోర్టు ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి

ఎపి స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎస్‌బిసిఎల్) మాజీ ఎమ్‌డి డి.వాసుదేవరెడ్డికి పోలీసులు సిఆర్‌పిసి సెక్షన్ 41ఎ కింద నోటీసులు ఇవ్వాలని హైకోర్టు గురువారం ఆదేశించింది. గుడివాడ పోలీసులు ఈ నెల 5న తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ వాసుదేవరెడ్డి వేసిన పిటిషన్‌ను జస్టిస్ విఆర్ కృపాసాగర్ విచారించారు. ప్రభుత్వ న్యాయవాది కృష్ణారెడ్డి వాదిస్తూ, వాసుదేవరెడ్డిపై నమోదైన కేసులో ఏడేళ్ల కన్నా తక్కువ శిక్షపడే సెక్షన్లే కాబట్టి 41ఎ నోటీసు ఇస్తామని చెప్పారు. దీంతో అందుకు అనుగుణంగా హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

కాకినాడ మాజీ ఎమ్మెల్యే సెక్యూరిటీ రద్దుపై నోటీసులు

తనకున్న 1 ప్లస్ 1 భద్రతను రద్దు చేయడాన్ని కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. దీనిని గురువారం జస్టిస్ బొప్పుడి కృష్ణమోహన్ విచారించి ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. పిటిషనర్‌కు ప్రాణహాని ఉందని, ఏకపక్షంగా 1 ప్లస్ 1 భద్రతను ఉపసంహరించడం అన్యాయమని న్యాయవాది వాదించారు. కౌంటర్ వేస్తామని ప్రభుత్వం చెప్పడంతో విచారణ మూడు వారాలకు వాయిదా పడింది.

హామీలిచ్చాను.. ఖజానా ఖాళీగా కనిపిస్తోంది

- శ్రీశైలం పర్యటనలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

'ఎన్నో హామీలు ఇచ్చాను.. చేయాలి.. కానీ ఖజానా ఖాళీగా కనిపిస్తోంది' అని సిఎం చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. అభివద్ధి, సంక్షేమానికి తొలిప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. నంద్యాల జిల్లా శ్రీశైలంలో గురువారం సిఎం పర్యటించారు. ఉండవల్లి నుంచి హెలికాప్టర్ ద్వారా సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా శ్రీశైలం వెళ్లి భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీశైలం ప్రాజెక్ట్ వద్దకు చేరుకుని రాయలసీమ ప్రాజెక్టులో ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కృష్ణా నదికి జలహారతి ఇచ్చి కృష్ణమ్మకు చీరసారె సమర్పించారు. అనంతరం సున్నిపెంట పాఠశాల ఆవరణంలో 'మన నీరు..మన సంపద' పేరుతో నీటి వినియోగదారుల సంఘం ప్రతినిధులతో చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. రాయలసీమలో కరువు లేకుండా చేయడం అందరి సంకల్పమన్నారు. కృష్ణా మిగులు జలాలను వాడుకోవచ్చని ఆనాడు ఎన్‌టిఆర్ చెప్పారని, హంద్రీనీవా, ఎస్‌ఆర్‌బిసి, గాలేరు నగరి ప్రాజెక్టులను ఆయన ప్రారంభిస్తే తాను పూర్తి చేశానని చెప్పారు. గతంలో టిడిపి ప్రభుత్వం రూ.69 వేల కోట్లు సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేస్తే వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రూ.19 వేల కోట్లు ఖర్చు పెట్టిందని, అదీ తమ ప్రభుత్వానికి రైతాంగం మీద ఉన్న చిత్తశుద్ధి అని అన్నారు. సముద్రంలోకి పోయే నీళ్లన్నీ రాయలసీమకు పంపిస్తే, అన్ని రిజర్వాయర్లు పూర్తయితే రాబోయే ఐదేళ్లు కరువు అనే మాట లేకుండా ప్రణాళికలు తయారు చేసే బాధ్యత తమదన్నారు. రాయలసీమను రతనాల సీమగా, శ్రీశైలాన్ని దివ్య క్షేత్రంగా తయారు చేస్తామన్నారు. సిద్దేశ్వరం దగ్గర రిజర్వాయర్ నిర్మాణానికి ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి, జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, నంద్యాల పార్లమెంటు సభ్యులు బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న చంద్రబాబునాయుడు

రెండు విడతల్లో రూ.2.39 లక్షల కోట్లు!

- 'ఓట్ ఆన్ అక్కౌంట్'లో భారీగా పెరిగిన ఖర్చు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఒకే ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు పెట్టిన ఓట్ ఆన్ అక్కౌంట్ తీరుపై విమర్శలు ఎదురవుతున్నాయి. రెండు ఓట్ ఆన్ అక్కౌంట్లు కలిపి ఏకంగా రూ.2.39 లక్షల కోట్ల వ్యయానికి అనుమతి తీసుకున్నారు. ఇంత భారీ మొత్తానికి అనుమతి తీసుకోవడం గత చరిత్రలో ఎప్పుడూ లేదని ఆర్థికశాఖ అధికారులే చెబుతున్నారు. దీంతో చివరి నాలుగు నెలలకు ఆర్థిక కష్టాలు తప్పవన్న భావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను గత ఫిబ్రవరిలో తొలిసారిగా ఓట్ ఆన్ అక్కౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం రూ.2.86 లక్షల కోట్లకు బడ్జెట్ ప్రవేశపెట్టి అందులో తొలి నాలుగు నెలలకు రూ.1.09 లక్షల కోట్లను వ్యయం చేసేందుకు శాసనసభలో అనుమతి తీసుకున్న సంగతి తెలిసిందే. జూలై 31తో గడువు పూర్తి కావడంతో మరోసారి ఆర్డినెన్స్ ద్వారా నాలుగు నెలలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం రూ.1.30 లక్షల కోట్ల వరకు అనుమతి తీసుకోవడం గమనార్హం. అంటే రెండు విడతల ఓట్ ఆన్ అక్కౌంట్‌ల ద్వారా ఎనిమిది నెలలకు రూ.2.39 లక్షల కోట్లకు అనుమతి తీసుకున్నారు. మొత్తం బడ్జెట్‌లో ఓట్ ఆన్ అక్కౌంట్ ద్వారా తీసుకున్న అనుమతి మొత్తం పోగా, ఇంకా రూ.61 వేల కోట్ల వరకు మాత్రమే చివరి నాలుగు నెలలకు అందుబాటులో ఉండే పరిస్థితి కనిపిస్తోంది. అంటే డిసెంబర్ నుంచి మార్చి వరకు నెలకు సగటున కేవలం రూ.15 వేల కోట్లు మాత్రమే అందుబాటులో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ నిధులు ఏమేరకు సరిపోవని వారంటున్నారు.

వార్షిక బడ్జెట్ పెంపు?

ప్రస్తుత తరుణంలో వార్షిక బడ్జెట్‌ను పెంచక తప్పనిసరి పరిస్థితులు కనిపిస్తున్నాయి. వాస్తవానికి ఫిబ్రవరి బడ్జెట్ ప్రతిపాదనల్లోనే మూడు లక్షల కోట్ల వరకు ప్రవేశపెడతారని అంచనా వేయగా, దానిని కేవలం రూ.2.86 లక్షల కోట్లకే పరిమితం చేశారు. తాజా పరిస్థితుల్లో చివరి నాలుగు నెలల ఆర్థిక కష్టాలను అధిగమించాలంటే నవంబర్ చివరిలో పెట్టే బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తుత బడ్జెట్‌ను సవరించక తప్పని స్థితి నెలకొంది. ఈ మేరకు ఆర్థిక శాఖ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆ సమావేశాల్లో రూ.3.10 లక్షల కోట్ల వరకు బడ్జెట్‌ను సవరించాలని భావిస్తున్నట్లు ఆర్థికశాఖ వర్గాల ద్వారా తెలిసింది. లేనిపక్షంలో డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు కష్టాలు తప్పవని ఆర్థికశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. రెండు విడతల ఓట్ ఆన్ అక్కౌంట్‌పై ఇతర శాఖల్లో కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో శాఖలకు కేటాయించే నిధులు కూడా ఎంతవరకు వస్తాయో అర్థం కాని పరిస్థితి నెలకొందని కొంతమంది సీనియర్ అధికారులే వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.

నెల్లూరు టౌన్ ప్లానింగ్‌పై నిత్యం స్పెషల్ డ్రైవ్

- మంత్రి నారాయణ

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

నెల్లూరులో టౌన్ ప్లానింగ్‌పై నిత్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో భవన నిర్మాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి... త్వరతగతిన పరిష్కరించి న్యాయం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి నారాయణ విలేకరులతో మాట్లాడుతూ.. టౌన్ ప్లానింగ్‌లో సాంకేతిక సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా టౌన్ ప్లానింగ్‌లో భవన నిర్మాణాల అనుమతులను సులభతరం చేసేలా చర్యలు మొదలు పెట్టామన్నారు. అన్ని అనుమతులు ఉండి నిర్మాణానికి నోచుకోని పెండింగ్ పనులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్పొరేషన్ కమిషనర్ల సంతకాలు ఫోర్జరీ వ్యవహారంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాస్తారోకో చేస్తున్న రైతులు

రోడ్డెక్కిన అన్నదాతలు

- ధాన్యం, మొక్కజొన్న రైతులకు బకాయిలు చెల్లించాలని రాస్తారోకో

ప్రజాశక్తి - కొయ్యలగూడెం (ఏలూరు జిల్లా)

దళారుల చేతుల్లో మోసపోయిన తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం గవరవరంలో గురువారం అన్నదాతలు రోడ్డెక్కారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కొయ్యలగూడెం - నల్లజర్ల రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ధాన్యం, మొక్కజొన్న పంటలను దళారులు కొనుగోలు చేసి మూడు నెలలు దాటినా సొమ్ములు చెల్లించలేదన్నారు. పోలవరం మండలంలో 137 మంది రైతులకు రూ.2.25 కోట్లు చెల్లించకుండా మోసం చేయడం దారుణమన్నారు. పంటల పెట్టుబడి కోసం పుస్తెలు తాకట్టు పెట్టి ఆరు గాలం కష్టపడి పంట పండిస్తే రైతుల కష్టం దళారుల పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను మోసగించిన దళారులపై చీటింగ్, క్రిమినల్ కేసులు బనాయించి అరెస్టులు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు అమ్మిన ధాన్యం, మొక్కజొన్న పంటల సొమ్మును చెల్లించేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. దళారులను శిక్షించి రైతులకు సొమ్ములు ఇప్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ప్రయివేటు మార్కెట్ వ్యవస్థపై నిఘా లేకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మోసపోయిన రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతుల ఆందోళనకు సిపిఎం, రైతు సంఘం, టిడిపి నాయకులు మద్దతు తెలిపారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

- పది గేట్ల ద్వారా దిగువకు విడుదల

ప్రజాశక్తి-శ్రీశైలం ప్రాజెక్టు

పదిగేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

కృష్ణా పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతూ ఉండడంతో పదిగేట్లను 18 అడుగుల మేరకు ఎత్తి 4,31,370 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గురువారం సాయంకాలం ఆరు గంటల సమయానికి ఎగువ జూరాల నుంచి 3,16,639 క్యూసెక్కులు, తుంగభద్ర ద్వారా 1,47,380 క్యూసెక్కులు వరదనీరు కలిపి 4,64,019 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నాయి. జలాశయ నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 883.80 అడుగులకు చేరింది. నీటి నిలువ సామర్థ్యం 215 టిఎంసిలకు గాను 208.721 టిఎంసిలుగా నమోదైంది. కుడిగట్టు విద్యుత్తు కేంద్రంలో గడిచిన 24 గంటలలో 24,917 క్యూసెక్కులతో 14.161 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తిని, ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో 35,315 క్యూసెక్కులతో 17.447 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తిని చేస్తూ దిగువ సాగర్‌కు 60,232 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడుకు 25,000 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 1600 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. మొత్తం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు 4,91,602 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

గోదావరి తగ్గుముఖం

కాటన్ బ్యారేజీ వద్ద నిలకడగా ఉన్న గోదావరి వరద

- భద్రాచలం వద్ద సాధారణ స్థాయికి నీటిమట్టం
- ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- సముద్రంలోకి 10.36 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి- యంత్రాంగం

గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. గురువారం నాటికి భద్రాచలం వద్ద సాధారణ స్థాయికి నీటి మట్టం చేరుకుంది. ప్రస్తుతం అక్కడ 39.80 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఉదయం ఏడు గంటలకే అక్కడ మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద కూడా వరద తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం కాటన్ బ్యారేజీ వద్ద 12.10 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. బ్యారేజీ నుంచి 10,25,865 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. వ్యవసాయ అవసరాల నిమిత్తం 8,800 క్యూసెక్కుల నీటి తూర్పు, మధ్య, పశ్చిమ కాల్వలకు అధికారులు విడుదల చేస్తున్నారు.

తూర్పు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో లంక గ్రామాలు వరద నీటి నుంచి బయటపడ్డాయి. దీంతో లంకవాసులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది శానిటేషన్ పనులను చేపట్టారు. రోడ్లపై బురదను తొలగించి బ్లీచింగ్ చల్లారు. ముంపు బాధితులందరకూ ఇళ్లకు చేరుకున్నారు. ఇళ్లను, పరిసరాలను శుభ్రం చేసుకునే పనిలో పడ్డారు. పి.గన్నవరం, అయినవిల్లి, మామిడికుదురు మండలాల్లో కాజ్‌వేలు నీటి నుంచి బయటపడటంతో రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన రెండు పునరావాస కేంద్రాలు ఇంకా కొనసాగుతున్నాయి.

అల్లూరి జిల్లాలోని విలీన మండలాలైన విఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాకల్లోని పలు గ్రామాల వారు పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు చేరుకుంటున్నారు. విఆర్.పురం మండలం నుంచి చింతూరు వెళ్లే ప్రధాన రహదారి మధ్య వరద నీరు తొలగకపోవడంతో రాకపోకలు కష్టంగా మారాయి. శ్రీరామగిరి, సీతంపేట, తుష్టివారిగూడెం, ప్రత్తిపాక, కన్నాయిగూడెం, చింత రేవుపల్లి రహదారులపై వరద నీరు తగ్గకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. సున్నంవారిగూడెం నుండి కన్నాయి గూడెం మధ్యలో రహదారులపై వరద తగ్గటంతో చెత్త పేరుకుపోయి కనిపించింది. ముంపు నుంచి బయటపడ్డ గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, గ్రామమంతటా బ్లీచింగ్ చల్లించాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో కనకాయలంక కాజ్‌వేపై ఇంకా వరద నీరు తగ్గుముఖం పట్టకపోవడంతో అక్కడి ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. నక్కలకాలువ, కాజా డ్రెయిన్ల ప్రభావంతో ఏనుగువానిలంక, పల్లిపాలెం, పెద్ద హరిజన పేట, చింతదిబ్బ, గుంపర్రు తదితర గ్రామాలు వరద నీటి నుంచి తేరుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.

ఐడిబిఐ బ్యాంక్ విదేశీ పరం..!

- దుబాయ్, టొరంటో దేశాల సంస్థలకు కట్టబెట్టొచ్చు
- అక్కడి సంస్థల బిడ్డింగ్
- పోటీలో కొటాక్ మహీంద్రా బ్యాంక్

ముంబయి : మోడీ సర్కార్ ఐడిబిఐ బ్యాంక్‌ను విదేశీపరం చేసే పనిలో ఉందని తెలుస్తోంది. ఐడిబిఐ బ్యాంక్‌లోని మెజారిటీ వాటాల విక్రయానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మూడు కీలక కొనుగోలు సంస్థలను గుర్తించినట్లు రిపోర్టులు వస్తున్నాయి. అందులో రెండు విదేశీ సంస్థలు ఉండటం గమనార్హం. తుది బిడ్డింగ్‌లో టొరంటోకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్సియల్ హోల్డింగ్స్, దుబాయ్‌కు చెందిన ఎమరైట్స్ ఎన్‌బిడి సహా దేశీయ కొటాక్ మహీంద్రా బ్యాంక్ నిలిచాయని ఈ వ్యవహారంతో సంబంధం కలిగిన వారి సమాచారం. వారం రోజుల్లోనే దీనిపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఐడిబిఐ బ్యాంక్‌లో కేంద్రానికి 45.48 శాతం, ఎల్ఐసికి 49.24 శాతం చొప్పున వాటాలున్నాయి. ఇందులోని 60.7 శాతం వాటాను విక్రయించాలనేది ప్రధాన యోచన. ఐడిబిఐ అమ్మకానికి సంబంధించి ఆర్థిక శాఖ 2022లో ప్రక్రియను ప్రారంభించింది. స్వాధీన చర్చలు కొనసాగుతున్నందున సంబంధిత వర్గాలు పూర్తి వివరాలు వెల్లడించలేదని రాయిటర్స్ తెలిపింది. కాగా.. ఈ వ్యవహారంపై ఆర్‌బిఐ, ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్సియల్ హోల్డింగ్స్, ఎమరైట్స్ ఎన్‌బిడి, కొటక్ మహీంద్రా బ్యాంక్ సంస్థలు తమ ఈ మెయిల్‌కు స్పందించడానికి నిరాకరించాయని రాయిటర్స్ తెలిపింది.

బిడ్డర్లు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారని.. తుది నిర్ణయం జరిగిన తర్వాత స్పష్టత రానుందని ఆ వర్గాలు తెలిపాయి. ప్రధాన బిడ్డింగ్‌దారుల్లో కెనడియెన్ బిలియనీర్ ప్రేమ్ వాట్సా, యుఎఇ, ఇండియా, సౌదీ అరేబియా తదితర దేశాల్లో కార్యకలాపాలు కలిగిన ఎమరైట్స్ ఎన్‌బిడి ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి ఐడిబిఐ బ్యాంక్‌ను ప్రయివేటీకరించనున్నామని ఇటీవల దీపమ్ సెక్రటరీ తూహిన్ కాంత పాండే తెలిపారు.

జులైలో రూ.1.82 లక్షల కోట్ల జిఎస్‌టి వసూళ్లు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న వస్తు, సేవల పన్నులు రికార్డ్‌లను సృష్టిస్తున్నాయి. ఈ ఏడాది జులైలో వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)లు 10.3 శాతం వృద్ధితో ఏకంగా రూ.1,82,075 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే మాసంలో రూ.1.74 లక్షల కోట్లు వసూళ్లయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జులై కాలంలో ఏకంగా రూ.6.56 లక్షల కోట్ల వసూళ్లు జరిగాయి. జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత 2024 ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.2.10 లక్షల కోట్లు జిఎస్‌టి వసూళ్లయ్యింది.

ఇన్ఫోసిస్ రూ.32వేల కోట్ల జిఎస్‌టి ఎగవేత

బెంగళూరు : దిగ్గజ ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ వేల కోట్ల జిఎస్‌టి ఎగవేతకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రూ.32,403 కోట్ల విలువ చేసే జిఎస్‌టి ఎగవేతకు సంబంధించి ముందస్తు షోకాజ్ నోటీసు అందుకున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. జులై 2017 నుంచి మార్చి 2022 మధ్య రూ.32వేల కోట్ల జిఎస్‌టి చెల్లింపులు జరుపలేదని కర్నాటక స్టేట్ జిఎస్‌టి ఆథార్టీ నోటీసులు జారీ చేసింది. కంపెనీకి సంబంధించి విదేశీ కార్యాలయాలు పెట్టే ఖర్చులపై జిఎస్‌టి చెల్లించలేదని ప్రధాన అరోపణ. ఈ షోకాజ్ నోటీసుపై సంస్థ వివరణ ఇవ్వనున్నట్లు ఇన్ఫోసిస్ పేర్కొంది. ఈ తరహా జిఎస్‌టి ఎగవేతలపై ఇతర ఐటి కంపెనీలపై కూడా జిఎస్‌టి అథారిటీలు దృష్టి సారించనున్నట్లు సమాచారం.

25వేల మార్క్‌కు నిఫ్టీ

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో ఎన్ఎస్ఇ నిఫ్టీ నూతన రికార్డ్‌ను సృష్టించింది. గురువారం సెషన్‌లో 108 పాయింట్లు పెరిగి 25వేల మార్క్‌ను అధిగమించింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వచ్చే సెప్టెంబర్‌లో వడ్డీ రేట్ల తగ్గింపు ఉండొచ్చని సంకేతాలు ఇవ్వడంతో భారత మార్కెట్లకు మద్దతు లభించింది. బిఎస్ఇ సెన్సెక్స్ ఇంట్రాడేలో 388.15 పాయింట్లు లేదా 0.47 శాతం పెరిగి 82,129.49 ఆల్‌టైం రికార్డ్‌ను నమోదు చేసింది. తుదకు 126 పాయింట్లు పెరిగి 81,867 వద్ద ముగిసింది. దీంతో వరుసగా నాలుగో రోజూ రికార్డ్ స్థాయికి చేరినట్లయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 60 పాయింట్లు రాణించి 25,010 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్‌టిపిసి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, నెస్లే ఇండియా, అదానీ పోర్ట్స్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు

పిఆర్‌సి వర్తింపజేయాలి

- 5న కలెక్టరు కార్యాలయాల వద్ద ధర్నాలు
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నూతన ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంటు చేసి, వారికి కూడా పిఆర్‌సి వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరావు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని ఎంబి భవన్‌లో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులకు నిరసనగా సిఐటియు ఆధ్వర్యాన ఈ నెల 5న జిల్లా కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాలో మున్సిపల్ కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకూ పిఆర్‌సి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల మున్సిపల్ కార్మికులు నిర్వహించిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ప్రమాద మరణానికి ఎక్స్‌గ్రేషియో రూ.7 లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, దహన సంస్కార ఖర్చులు రూ.20 వేలకు పెంచుతూ ఇచ్చిన హామీలకు ప్రభుత్వం వెంటను జిఓలు ఇవ్వాలని కోరారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు కూడా పారిశుధ్య కార్మికుల వలే సమానమైన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఉమామహేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నూకరాజు, ఉరికూటి రాజు, బి సోమయ్య, కె పెంచలనరసయ్య, ఎస్ జ్యోతిబసు, ఎన్‌వై నాయుడు, బి ముత్యాలరావు పాల్గొన్నారు.

టాటా మోటార్స్ రెవెన్యూ

రూ.1.07 లక్షల కోట్లు

- క్యూ1 లాభాల్లో 74 శాతం వృద్ధి

ముంబయి : దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ 2024-25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 5.7 శాతం వృద్ధితో ఏకంగా రూ.1,07,316 కోట్ల రెవెన్యూ సాధించింది. ఇదే సమయంలో కంపెనీ నికర లాభాలు ఏకంగా 74 శాతం ఎగిసి రూ.5,566 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.3,203 కోట్ల లాభాలు ప్రకటించింది. గడిచిన క్యూ1లో కంపెనీ వాణిజ్య వాహనాల రెవెన్యూ 5.1 శాతం పెరిగి రూ.17,800 కోట్లకు పెరగ్గా.. ప్యాసింజర్ వెహికల్స్ రెవెన్యూ 7.7 శాతం తగ్గి రూ.11,800 కోట్లుగా నమోదయ్యింది. వాణిజ్య వాహనాల టోకు అమ్మకాలు 6 శాతం పెరిగి 93,700 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి.

తగ్గిన ఐటిసి లాభాలు

బహుళ వ్యాపారాలు కలిగిన ఐటిసి లిమిటెడ్ 2024-25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో పేపర్‌బోర్డ్, పేపర్, ప్యాకేజింగ్, హాస్పిటాలిటీ, వ్యవసాయ వ్యాపారాల్లో తగ్గుదలను నమోదు చేసింది. దీంతో గడిచిన క్యూ1లో కంపెనీ నికర లాభాలు 0.26 శాతం తగ్గి రూ.5,091.59 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.5,104.93 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ రూ.18,639.48 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ1లో 7.5 శాతం పెరిగి రూ.20,0209.60 కోట్లుగా నమోదయ్యాయి.

జొమాటో ఫలితాలు ఆకర్షణీయం

ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం 2024-25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో కంపెనీ నికర లాభాలు బహుళ రెట్లు పెరిగి రూ.253 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.2 కోట్ల లాభాలను నమోదు చేసింది. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ 3,562 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ1లో 74 శాతం యపెరిగి రూ.4,206 కోట్లుగా ప్రకటించింది. తమ వృద్ధిలో క్విక్ కామర్స్ విభాగం కీలక పాత్ర పోషించిందన్నారు.

ఇన్సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ కోడ్, 2016 కింద ఇ-వేలం విక్రయ నోటీసు
న్యూక్లియస్ శాటిలైట్ కమ్యూనికేషన్స్ (మద్రాస్) ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో)

వేలం తేదీ & సమయం: గురువారం, 5 సెప్టెంబర్, 2024 ఉ.11 నుండి మ.1 గంటల వరకు

గౌరవనీయమైన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ వారు ఇన్సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ కోడ్, 2016లోని సెక్షన్ 33 కింద సెప్టెంబర్ 12, 2023 నాటి ఉత్తర్వు ఆధారంగా మెసర్స్ న్యూక్లియస్ శాటిలైట్ కమ్యూనికేషన్స్ (మద్రాస్) ప్రైవేట్ లిమిటెడ్ యొక్క లిక్విడేషన్ కోసం ఆదేశించినట్లు నోటీసు ఇవ్వబడింది మరియు శ్రీ.రామకృష్ణన్ సదాశివన్‌ను కార్పొరేట్ రుణదాత యొక్క లిక్విడేటర్‌గా నియమించింది. ఈ నోటీసు లిక్విడేటర్ నిర్వహించిన వేలం విక్రయానికి సంబంధించినది.

దయచేసి గమనించండి: ఇ-వేలం ద్వారా ఆస్తుల విక్రయం ఖచ్చితంగా "ఎక్కడ ఎలా వున్నది మరియు అక్కడ అలాగే" మరియు రికోర్స్ లేకుండా" ప్రతిపాదికన నిర్వహించబడుతుంది.

తదుపరి, ఈ-వేలం యొక్క వివరణాత్మక నియమ& నిబంధనలు & ఆన్‌లైన్ వేలం విక్రయం యొక్క ఇతర వివరాలను కలిగిఉన్న వేలం ప్రక్రియ మెమోరాండం వెబ్‌సైట్: https://nesl.co.in/auction-notices-under-ibc/ లోఅందుబాటులో ఉన్నాయి లేదా దిగువ పేర్కొన్న ఇ-మెయిల్ అడ్రస్‌లో లిక్విడేటర్‌ను సంప్రదించవచ్చు. తదుపరి వివరణల కోసం, సంబంధిత పార్టీలు లిక్విడేటర్ వారిని ఇక్కడ సంప్రదించవచ్చు: ఇ-మెయిల్ ఐడి: nucleussatellitecomm @gmail.com (లేదా) sadasivanr@gmail.com.

వేలం వేయబడుతున్న ఆస్తుల షెడ్యూల్:

లాట్ నెం	అసెట్	రిజర్వ్ ధర (రూ.)	ధరావత్తు(రూ.)	బిడ్ పెంపుదల (రూ.)
A	ఎ) కార్పొరేట్ రుణగ్రహీత యొక్క విక్రయం- గోయింగ్-కన్సర్న్‌గా మెసర్స్ న్యూక్లియస్ ఎ శాటిలైట్ కమ్యూనికేషన్స్ (మద్రాస్) ప్రైవేట్ లిమిటెడ్ గమనిక: నగదు & బ్యాంక్ బ్యాలెన్స్‌లు మరియు ప్రభుత్వ అండర్‌టేకింగ్‌లు మరియు/లేదా ఇతర చట్టబద్ధమైన అథారిటీల నుండి స్వీకరించాల్సిన ఏవైనా రీఫండ్‌లు/ప్రోత్సాహకాలు మరియు అన్ని/ ఏదైనా లిటిగేషన్‌ల నుండి వచ్చే ఆదాయాలు విక్రయించబడుతున్న ఆస్తుల నుండి మినహాయించబడతాయి.	14,50,00,000	1,45,00,000	5,00,000
B	బి) లీజు భూమి & ఫ్యాక్టరీ బిల్డింగ్ యొక్క స్థిరమైన ఆస్తుల విక్రయం	13,50,00,000	1,35,00,000	5,00,000

* రిజర్వ్ ధరకు అదనంగా వర్తించే జిఎస్టీ వసూలు చేయబడుతుంది.

గమనిక:
1) శ్రీసిటీ, ప్లాట్ నెం 465, సిట్రస్ డ్రైవ్, మోపురుపల్లి, వరదయ్యపాలెం (ఎం), చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-517541లోని అన్ని ఆస్తులు వేలం వేయబడుతున్నవి.
2) ప్రాధాన్యత క్రమం 1) టాట్ ఏ, 2) లాట్ బి

వేలం సమయాలు:

క్ర.సం.	ఈవెంట్ వివరణ	తేదీ
1	వేలం ప్రకటన జారీ	2 ఆగష్టు, 2024
2	కాబోయే బిడ్డర్ ద్వారా 29ఏ అర్హత అండర్‌టేకింగ్ మరియు కెవైసీ పత్రాల సమర్పణ.	02 ఆగష్టు, 2024 నుండి 21 ఆగష్టు, 2024 వరకు.
3	అర్హత కలిగిన బిడ్డర్ యొక్క ప్రకటన (సమర్పించబడిన అర్హత పత్రాల & కెవైసి ఆధారంగా)	23 ఆగష్టు, 2024న లేదా అంతకు ముందు.
4	వేలం కింద ఉన్న ఆస్తులను తనిఖీ చేయడానికి అర్హత పొందిన బిడ్డర్‌లకు సమయం.	24 ఆగష్టు, 2024 నుండి 30 ఆగష్టు, 2024 వరకు (ఉ.10 నుండి సా.5 గంటల వరకు లిక్విడేటర్ ముందస్తు అనుమతితో)
5	అర్హత కలిగిన బిడ్డర్లు బిడ్ ఫారం మరియు ఈఎండిని సమర్పించడానికి చివరి	2 సెప్టెంబర్, 2024
6	ఇ-వేలం తేదీ	5 సెప్టెంబర్, 2024

తేదీ: 2 ఆగష్టు, 2024.
ప్రదేశం: చెన్నై.

సం/-
రామకృష్ణన్ సదాశివన్
IBBI/IPA-001/IP-P00108/2017-18/10215
లిక్విడేటర్ -న్యూక్లియస్ శాటిలైట్ కమ్యూనికేషన్స్ (మద్రాస్) ప్రైవేట్ లిమిటెడ్
రిజిస్టర్డ్ మెయిల్: sadasivanr@gmail.com
కరస్పాండెన్స్ మెయిల్: nucleussatellietcomm@gmail.com
చిరునామా: పాత నెం.22, కొత్త నెం.28, మెనోడ్ స్ట్రీట్, పురసవల్కం, చెన్నై-600 007.
మొబైల్ నెం.94444 55982

సంపాదకీయం

ఇజ్రాయిల్ దురాగతం

అమానుష దాడులకు స్వస్తి చెప్పి, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో హితవు చెబుతున్నా- ఇజ్రాయిల్ తన బరితెగింపు ధోరణి నుంచి వెనక్కి తగ్గటం లేదు. బుధవారం నాడు హమాస్ రాజకీయ అధినేత ఇస్మాయిల్ హనియేని ఇరాన్‌లో హత్య చేయడం ద్వారా తన తెంపరితనాన్ని మరోకసారి చాటుకొంది. దానికన్నా ముందు లెబనాన్ రాజధాని బీరూట్‌లో వైమానిక దాడి చేసి, హిజ్బుల్లా అగ్రశ్రేణి కమాండర్ ఫువాద్ షుక్రని హతమార్చింది. ఇజ్రాయిల్ ఏకపక్ష దాడుల కారణంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తత, యుద్ధజ్వాల సమీపకాలంలో చల్లారే పరిస్థితి హరించుకుపోయింది. దశాబ్దాలు తరబడి పశ్చిమాసియాలో కొనసాగుతున్న అశాంతికి, అలజడికి అమెరికా ఆజ్యం పోస్తుంటే- దాని పనుపున ఇజ్రాయిల్ రెచ్చిపోతోంది. ఇరాన్ నూతన అధ్యక్షుడి ప్రమాణ స్వీకారోత్సవానికి అతిథిగా వచ్చిన హనియేని అదే దేశంలో, అతడి సొంత నివాసం మీదనే దాడి చేసి, హత్య చేయడం ద్వారా ఆ దేశానికి కూడా సవాలు విసిరింది.

వైమానిక దాడిలో మృతి చెందిన హనియే హమాస్‌లో కీలకమైన నేత. ఆ సంస్థలో షేక్ అహ్మద్ యాసిన్, అబ్దుల్ అజీజ్ రంతీసి తరువాత శక్తివంతమైన నాయకుడు. 2004 మార్చిలో ఇజ్రాయిల్ క్షిపణి దాడి చేసి యాసిన్‌ని హతమార్చింది. ఆ తరువాత హమాస్ చీఫ్‌గా నియమితుడైన రంతీసిని కూడా ఇజ్రాయిల్ సైనికులు హత్య చేశారు. ఆ ఇద్దరి నిష్క్రమణతో స్తబ్దత నెలకొన్న హమాస్‌లో హనియే కొత్త జవజీవాలు నింపాడు. కొన్ని ప్రాంతాలకు, సాయుధ కార్యకలాపాలకు పరిమితమై ఉన్న సంస్థని ప్రజల్లోకి విస్తరించాడు. తమ జీవన హక్కులను హరిస్తున్న ఇజ్రాయిల్‌పై యువత తిరగబడాలని, తలెత్తుకొని జీవించాలని ఉత్తేజకరమైన ప్రసంగాలు చేసి, వేలాదిమందిని హమాస్‌లో భాగస్వాములను చేశాడు. 2005లో ఇజ్రాయిల్ గాజా నుంచి వైదొలిగేలా సాగిన పోరాటంలో కీలకపాత్ర పోషించాడు. తరువాత జరిగిన ఎన్నికల్లో పాల్గొన్న హమాస్ ప్రజల ఆదరణతో వెస్ట్‌బ్యాంకు, గాజా ప్రాంతాల్లో అధికారంలోకి వచ్చింది. అప్పటికే అధికారంలో భాగం పంచుకుంటూ ఉన్న పాలస్తీనా అథారిటీ (పిఎ)కి, హమాస్‌కి మధ్యా ఘర్షణలు చోటు చేసుకున్న నేపథ్యంలో- హనియే వంటి నాయకులు ఇతర దేశాల్లో తలదాచుకోవాల్సి వచ్చింది.

ఏళ్ల తరబడి జైళ్లలో బంధించిన పాలస్తీనా పౌరులను విడుదల చేయాలి, జీవన హక్కును హరించే చర్యలను విడనాడాలి వంటి డిమాండ్లతో 2023 అక్టోబరు 7వ తేదీన హమాస్ ... ఇజ్రాయిల్‌పై మెరుపు దాడులు చేసింది. దాంతో, హమాస్‌ని అంతం చేయటమే తమ లక్ష్యమని ప్రకటించిన ఇజ్రాయిల్ ... భారీ దాడులకు తెగించింది. తొలిరోజు నుంచే నేరుగా పాలస్తీనా ప్రజలపై విచక్షణా రహితంగా బాంబులు, క్షిపణులు ప్రయోగించి, వేలాదిమందిని బలి తీసుకోవడం మొదలు పెట్టింది. జులై 17 నాటికి 39,415 మంది పాలస్తీయన్లను హత్య చేసింది. అందులో 52 శాతం మంది యుద్ధంతో ఎలాంటి సంబంధమూ లేని పిల్లలూ, మహిళలూ కావడం విషాదం! ఈ యుద్ధానికి స్వస్తి చెప్పి, చర్చలు జరపాలని ఐక్యరాజ్య సమితితో సహా ప్రపంచ దేశాలన్నీ సూచిస్తున్నా ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు చెవికెక్కడం లేదు. పాలస్తీనాలో ప్రశాంతత, రాజకీయ స్థిరత్వం నెలకొనేలా ఉమ్మడి లక్ష్యం ఉన్న 14 సంస్థలూ, పార్టీలను ఏకం చేసేందుకు ఇటీవల చైనా మధ్యవర్తిత్వంతో జరిగిన ప్రయత్నం విజయవంతం అయింది. అమెరికా, ఇజ్రాయిల్‌లకు ఈ పరిణామం నచ్చని నేపథ్యంలోనే అధినేతల హత్యలు జరిగాయి. హనియే హత్యను ఐరాస భద్రతామండలి ఖండించింది. తమ భూభాగం మీద జరిగిన హత్యకు అమెరికా, ఇజ్రాయిల్ బాధ్యత వహించాలని ఇరాన్ హెచ్చరించింది. చైనా, రష్యా, అల్జీరియా, లెబనాన్ తదితర దేశాలు ఈ హత్యను నిర్ద్వంద్వంగా ఖండించాయి. భారత ప్రభుత్వం ఇంతవరకూ స్పందించకపోవడం విచారకరం. హమాస్‌కి ఇరాన్ మద్దతు ఇవ్వడం వల్లే ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైందంటూ అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తమ వైఖరిని బయట పెట్టుకున్నాయి. ఈ దేశాల ప్రత్యక్ష, పరోక్ష మద్దతుతోనే ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని, దురాక్రమణ పర్వాన్ని కొనసాగిస్తుందన్నది స్పష్టం. ప్రపంచశాంతిని కాంక్షిస్తున్న దేశాలూ, సంస్థలూ తక్షణం అవసరమైన కార్యాచరణకు దిగి, ఇజ్రాయిల్ నరమేధానికి స్వస్తి చెప్పించాలి.

మహనీయుని మాట

ఏది దానంతట అది
మన దగ్గరకు రాదు.
శోధించి సాధించాల్సిందే.
- శ్రీశ్రీ

పదేళ్ళ ఎపి ఆర్థిక శ్వేతపత్రం - రెండు ప్రభుత్వాల నిర్వాకం

విశ్లేషణ

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన తెలుగుదేశం నాయకత్వం లోని జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం వివిధ రంగాలపై ఏడు శ్వేత పత్రాలు విడుదల చేసింది. గత పదేళ్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై విడుదల చేసిన శ్వేత పత్రం ఇందులో ఒకటి.

తాము చేపట్టిన అభివృద్ధి విధానాలు, నమూనాను విడనాడి 2019-24 మధ్య పాలన సాగించిన జగన్మోహన్ రెడ్డి ఆర్థిక విధ్వంసానికి పాల్పడ్డారని, ఫలితంగా రూ.6.94 లక్షల కోట్ల రాష్ట్ర స్థూల ఉత్పత్తి కోల్పోయామని, దీనివల్ల రాష్ట్రానికి సొంత రాబడి తగ్గిపోయిందని శ్వేత పత్రం విడుదల సందర్భంగా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని 9.74 లక్షల కోట్ల అప్పుల పాల్జేశారని, గత ఐదేళ్లలో స్థానిక సంస్థలకు కేంద్రం జమేసిన ఆర్థిక సంఘం నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం వాడుకొని స్థానిక సంస్థల అభివృద్ధిని దెబ్బ తీసిందని తెలిపారు. అమరావతి, పోలవరం, విద్యుత్ రంగాన్ని ధ్వంసం చేయడం వల్ల పెట్టుబడిదారులు రాష్ట్రానికి దూరమయ్యారని, ఈ అరాచక ఆర్థిక విధానం వల్ల రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడి పోవటమే కాకుండా ఖజానా కూడా దివాలా తీసిందన్నారు.

డా॥ బి. గంగారావు

ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టలేని పరిస్థితి అని, ఓట్ ఆన్ అకౌంట్ లోనే కొంత కాలం రాష్ట్రాన్ని కొనసాగిస్తామని రూ.లక్షా 29 వేల కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్సు తీసుకొచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేదనే సాకు చూపి ఎన్నికల మేనిఫెస్టో హామీల అమలు వెంటనే సాధ్యం కాదని, ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాలు ఇప్పట్లో అమలుకు ప్రయత్నాలు ఉండవనే సంకేతం ఈ శ్వేతపత్రం ద్వారా వెల్లడవుతున్నది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందనటంలో, వైసిపి ఐదేళ్ళ కాలంలో ఆర్థిక అరాచక పద్ధతులు అనుసరించిందనటంలో కూడా ఎలాంటి సందేహం లేదు. రాష్ట్రాలు ఈ దుస్థితికి రావటానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రధాన కారణం కాగా ఈ వాస్తవాన్ని చంద్రబాబు నాయుడు ఉద్దేశపూర్వకంగానే శ్వేతపత్రంలో విస్మరించారు. పత్రం మొత్తంలో ఎక్కడ కూడా కేంద్ర ప్రభుత్వ వివక్షత గురించి ఒక్క మాటంటే ఒక్క మాట కూడ ప్రస్తావించలేదు. వాస్తవంగా 2014-19లో తెలుగుదేశం ప్రభుత్వం, 2019-24 మధ్య వైసిపి ప్రభుత్వం అనుసరించిన విధానాలు ఒకటే.

రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి రూ.97 వేల కోట్ల అప్పు చూపించబడింది. 2018-19 నాటికి రూ.3.62 లక్షల కోట్లకు చేరింది. ఇందులో లక్ష నాలుగు వేలు బడ్జెటేతర అప్పులు కూడా ఉన్నాయి. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విద్యుత్ రంగం, పౌర సరఫరా, ఇతర డిపార్ట్‌మెంట్ల నుండి అప్పులు సేకరించి రాష్ట్ర బడ్జెట్ అవసరాలకు వినియోగించుకుంది. వైసిపి ప్రభుత్వం బడ్జెటేతర అప్పులు విపరీతంగా చేసిందని ఇప్పుడు చంద్రబాబు నాయుడు విమర్శిస్తున్నారు. బడ్జెటేతర అప్పులు చేయడం మంచిదా? చెడ్డదా? అనే దానిని పక్కనబెడితే, రాష్ట్రాలు అప్పులు ఎక్కువగా చేయాల్సిన పరిస్థితి ఎందుకు కలుగుతున్నది? దీనిని పరిశీలిస్తే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పన్ను ఆదాయాలు పెంచుకునే మార్గాలు కుదించటం, కేంద్ర ప్రభుత్వానికి వచ్చే పన్ను ఆదాయాల నుండి రాష్ట్రాలకు న్యాయబద్ధంగా నిధులు బదిలీ చేయకపోవడం, కేంద్ర గ్రాంట్లు కోతతో పాటు, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు రాష్ట్రాలు కూడా ఎక్కువ భారం భరించాల్సి రావటం ముఖ్యమైనది. ఈ వాస్తవాలు మాత్రం శ్వేతపత్రంలో లేవు.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రాల అప్పులపై అనేక నియంత్రణలు పెడుతున్నది. ప్రతి ఏడాది రాష్ట్రాలు ఎంత అప్పు తీసుకోవటానికి అర్హత ఉందో ముందుగానే కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జిఎస్‌డిపి)లో 3 శాతానికి మించి ఉండకూడదని షరతు విధించారు. దీనికి లోబడి మాత్రమే రాష్ట్రాలు అప్పులు సేకరించుకోవాలి. ఆర్థిక నిర్వహణకు ఈ అప్పుల ద్వారా వచ్చే ఆదాయం కూడా సరిపోక పోవటం వల్ల రాష్ట్రాలు తమ పరిధిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ఏజెన్సీలు, కార్పొరేషన్ల ద్వారా అప్పులు సేకరించి వాటిని బడ్జెట్ అవసరాలకు వినియోగించుకుంటున్నాయి. ఇప్పుడు కేంద్ర బిజెపి సర్కార్ బడ్జెటేతర అప్పులను నియంత్రించటానికి తీవ్ర షరతులు విధించటం, వీటిని కూడా రాష్ట్రాలకు నిర్ణయించే అప్పుల అర్హతలో కలుపుతామని ప్రకటిస్తున్నది. ఇదే జరిగితే రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి ఇంకా తీవ్రంగా దిగజారుతుంది.

కేంద్ర ప్రభుత్వం మాత్రం విచ్చలవిడిగా అప్పులు చేస్తూ కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నది. దేశ జిడిపిలో ఏడాదికి 3 శాతానికి మించి అప్పులు తీసుకోరాదని నిబంధన ఉన్నా దానిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నది. రాష్ట్రాలకు బడ్జెటేతర అప్పులు తీసుకోకూడదని నిబంధనలు పెడుతూ కేంద్రం మాత్రం బడ్జెటేతర అప్పులు భారీగా సేకరిస్తున్నది. 2024 మార్చి నాటికి కేంద్ర ప్రభుత్వ స్వదేశీ, విదేశీ అప్పు మొత్తం రూ.181 లక్షల కోట్లకు చేరింది. దేశ జిడిపిలో 85 శాతానికి దాటింది. రాష్ట్రాలకు మాత్రం మొత్తం అప్పు ఆ రాష్ట్ర జిఎస్‌డిపిలో 25 శాతానికి మించకూడదని నిబంధన విధిస్తున్నది.

ఈ వాస్తవాలన్నింటిని చంద్రబాబు ఆర్థిక శ్వేతపత్రంలో కావాలనే పేర్కొనలేదు. 2024-25 కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన విధంగా నిధులు కేటాయించకపోయినా, ముఖ్యంగా విభజన చట్టంలో పేర్కొన్న చాలా అంశాలకి నిధులు కేటాయించకపోయినా చంద్రబాబు నాయుడు స్పందించలేదు. ఆఖరికి రాజధాని నిర్మాణానికి గ్రాంట్ రూపంలో కేంద్రం నిధులివ్వాలి. కాని ఇవ్వలేదు. రూ.15 వేల కోట్లు అప్పుగా నిధులు ఏర్పాటు చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటన చేస్తే దానికే ముఖ్యమంత్రి సంతృప్తిపడిపోయారు. ఈ లొంగుబాటు వైఖరే టిడిపి, వైసిపి పరిపాలనా కాలంలో రాష్ట్రాన్ని ఆర్థికంగా కుంగదీసింది.

> ఈ రెండు పార్టీలకు రాష్ట్రాభివృద్ధిలో ప్రజా దృక్పథం లేదు. రాష్ట్ర నిధులు కేటాయింపులో సమగ్ర ప్రణాళిక లేదు. నిధుల కేటాయింపుల్లో మొదటి ప్రాధాన్యత ఏమిటి? ద్వితీయ ప్రాధాన్యత ఏమిటి? అనే దానిలో అరాచకపు పద్ధతిని అనుసరిస్తున్నాయి. ప్రజా సంక్షేమం, నీటి ప్రాజెక్టులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విద్య, వైద్య సదుపాయాల పెంపు, స్థానిక సంస్థలకు రాష్ట్రాదాయంలో కనీసం 20 శాతం నిధులు బదిలీ, శ్రామికుల వేతనాల పెంపు, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల అభివృద్ధికి నిధులు కేటాయింపులో ఈ పార్టీలకు ప్రాధాన్యత లేదు. కేవలం ఎన్నికల దృష్టిలో ప్రజాకర్షక కొన్ని పథకాలు తప్ప ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో శక్తివంతమైన మార్పులు తీసుకురావటానికి, పేదరికం, ఆర్థిక అసమానతలు రూపుమాపటానికి కృషి చేయటంలేదు. ప్రభుత్వ పెట్టుబడుల కల్పన లేకుండా ఆర్థిక, సామాజిక వ్యవస్థలను బలహీనం చేస్తున్నాయి.

కోవిడ్ పరిస్థితులను ఉపయోగించుకొని రాష్ట్రాలకు షరతుల రుణాలు ఎరేసి అనేక రంగాల్లో సంస్కరణలు మోడీ ప్రభుత్వం రాష్ట్రాల్లో అమలుకు పూనుకుంది. వైసిపి ప్రభుత్వం ఈ రుణాలు తీసుకొని విద్యుత్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పట్టణ రంగాల్లోను, ఒకే దేశం-ఒకే కార్డు, భూ సర్వే-రిజిస్ట్రేషన్లు, కార్మిక చట్టాలు ఇలా అనేక వాటిల్లో ప్రజా వ్యతిరేక సంస్కరణలు అమలు చేసింది. టిడిపి కూడా పార్లమెంట్‌లో ఈ సంస్కరణలను బలపరిచింది. 2014-19 మధ్య కాలంలో కూడా ఈ సంస్కరణల్లో కొన్ని అమలు చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేర పెద్ద ఎత్తున పెట్టుబడిదారులకు భూములు, పన్ను రాయితీలు ఇచ్చి రాష్ట్ర ఖజానాకు ఆదాయం రాకుండా గండి కొట్టారు. అందుకే చంద్రబాబు పాలనలో నాలుగేళ్ళ పాటు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రానికి కేంద్రం ప్రథమ ర్యాంకు ఇచ్చింది. ఇవే విధానాలు వైసిపి కొనసాగించటం వల్ల రాష్ట్రానికి మొదటి ర్యాంకు కొనసాగింది. అంటే పెట్టుబడిదారులకు సంపదను ధారాదత్తం చేయటంలో రెండింటి మధ్య ఎలాంటి తేడా లేదు. ఇటీవల ఎన్నికల్లో వైసిపి ఓడిపోవటానికి ముఖ్య కారణాల్లో ల్యాండ్ టైట్లింగ్ చట్టం ఒకటి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం దానిని రద్దు చేసింది. కాని ఈ చట్టం తిరిగి మరొక రూపంలో రాష్ట్రంలో అమలు చేయటం అనివార్యం. ఎందుకంటే భూ చట్టాలు, విధానాల్లో మార్పులు తీసుకురావటానికి గత రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అందుకు కొంత రుణం కేంద్రం రాష్ట్రానికి ఇచ్చింది. అందువల్ల రాష్ట్రాలు తప్పించుకోలేనంతగా ఆర్థిక విష వలయంలోకి బిజెపి రాష్ట్రాలను నెడుతున్నది.

ఆర్థిక శ్వేతపత్రంలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గ్రాంట్లను కూడా వైసిపి ప్రభుత్వం దారి మళ్ళించి బడ్జెట్ అవసరాలకు వినియోగించుకొని స్థానిక సంస్థల అభివృద్ధిని దెబ్బ తీసిందని పేర్కొన్నారు. ఇది వాస్తవం. కేంద్ర ఆర్థిక సంఘం నిధులే కాదు. స్థానిక సంస్థలకు స్థానికంగా వచ్చే పలురకాల పన్నులు, పన్నేతర ఆదాయాలను కూడా అక్రమంగా వాడుకుంది. ఇది ఇప్పుడే కాదు అనేక సంవత్సరాల నుండి స్థానిక సంస్థల నిధులు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించుకుంటూ స్థానిక సంస్థలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తూ వస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో ఆర్థిక సంఘాలను కూడా క్రమం తప్పకుండా నియమించటంలేదు. నియమించినా ఆ కమిటీలు ఇచ్చిన సిఫార్సులను అమలు చేయటంలేదు. చంద్రబాబు నాయుడు పరిపాలన కాలంలో కూడా ఇదే పద్ధతి కొనసాగింది. పై పెచ్చు టిడిపి పాలనలో కేంద్ర బిజెపి ప్రభుత్వ ఒత్తిడితో సిఎఫ్‌ఎంఎస్ (కాంప్రిహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) అనే వ్యవస్థను ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల ఆదాయాలన్నింటిని ఈ సంస్థకి డిజిటల్ లింక్ చేశారు. దీంతో స్థానిక సంస్థలకు వచ్చే నిధులు, స్థానిక పన్ను ఆదాయాలు స్వేచ్ఛగా వినియోగించుకోవటానికి వీలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో పెట్టారు. ఈ వ్యవస్థ జగన్‌మోహన్ రెడ్డికి వరప్రసాదంగా మారింది. ఇప్పుడు ఇదే పద్ధతిని చంద్రబాబు ప్రభుత్వం వినియోగించుకుంటుంది. లేదంటే స్థానిక సంస్థలను సిఎఫ్‌ఎంఎస్ నుండి మినహాయించాలి. ఇది జరగని పని.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రాల ఆర్థిక వనరులపైన, హక్కులపైన తీవ్ర దాడి జరుగుచున్నది. ఆర్థిక సంఘం నిధులు కేటాయింపుల్లో, గ్రాంట్లు ఇవ్వటంలో, ప్రత్యేక అభివృద్ధి నిధులను మంజూరు చేయటంలో తీవ్ర అణచివేత సాగిస్తున్నది. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాగా విడదీయవలసిన ఆదాయ నిధి (డివిజిబుల్ పూల్) పరిమాణాన్ని దారుణంగా తగ్గిస్తున్నది. కేంద్రం విధిస్తున్న సర్‌చార్జీలు, సెస్‌ల ద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్రాలకు ఇవ్వడంలేదు. దీనివల్ల రాష్ట్రాలు ఆర్థికంగా చాలా నష్టపోతున్నాయి. స్థానిక సంస్థలకు ఇస్తున్న గ్రాంట్లన్నీ సంస్కరణల అమలు కోసం షరతులతో ముడిపెట్టి ఇస్తున్నది. కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్రాల వాటా నిష్పత్తి పెంచటం వల్ల రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడుతున్నది. ఈ నేపథ్యంలో కేంద్రం మొత్తం పన్నుల ఆదాయంలో కనీసం 50 శాతం రాష్ట్రాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన సాగిస్తున్నాయి. కాని రాష్ట్రంలోని తెలుగుదేశం, వైసిపి పార్టీలు కేంద్ర బిజెపిపై ఒత్తిడి తీసుకు రాకుండా లొంగుబాటు ప్రదర్శించడం వల్ల ఆంధ్ర రాష్ట్రం ఆర్థికంగా నష్టపోతున్నది. అందువల్లే గడిచిన దశాబ్ద కాలంలో విభజన చట్టంలోని అనేక అంశాలకు నిధులు కేటాయించకుండా కేంద్రం ఎగనామం పెట్టింది.

ఈ రెండు పార్టీలకు రాష్ట్రాభివృద్ధిలో ప్రజా దృక్పథం లేదు. రాష్ట్ర నిధులు కేటాయింపులో సమగ్ర ప్రణాళిక లేదు. నిధుల కేటాయింపుల్లో మొదటి ప్రాధాన్యత ఏమిటి? ద్వితీయ ప్రాధాన్యత ఏమిటి? అనే దానిలో అరాచకపు పద్ధతిని అనుసరిస్తున్నాయి. ప్రజా సంక్షేమం, నీటి ప్రాజెక్టులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విద్య, వైద్య సదుపాయాల పెంపు, స్థానిక సంస్థలకు రాష్ట్రాదాయంలో కనీసం 20 శాతం నిధులు బదిలీ, శ్రామికుల వేతనాల పెంపు, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల అభివృద్ధికి నిధులు కేటాయింపులో ఈ పార్టీలకు ప్రాధాన్యతలేదు. కేవలం ఎన్నికల దృష్టిలో ప్రజాకర్షక కొన్ని పథకాలు తప్ప ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో శక్తివంతమైన మార్పులు తీసుకురావటానికి, పేదరికం, ఆర్థిక అసమానతలు రూపుమాపటానికి కృషి చేయటంలేదు. ప్రభుత్వ పెట్టుబడుల కల్పన లేకుండా ఆర్థిక, సామాజిక వ్యవస్థలను బలహీనం చేస్తున్నాయి. ఫలితంగా స్థూల అంకెల్లో ఘనంగా ఉన్నా ప్రజా ఆర్థిక కోణంలో ఆర్థికం తిరోగమనంలో కొనసాగుతోంది.

/వ్యాసకర్త సెల్ : 9490098792 /

సామాన్యుడే పద్మవ్యూహాన్ని ఛేదిస్తాడు!

వ్యాఖ్య

బడ్జెట్ మీద లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జులై 29న చేసిన ఉపన్యాసం చాలా ఆవేశంగా, ఆర్ద్రంగా అర్థవంతంగా ప్రజల పక్షాన సాగింది. ఆరెస్సెస్, బిజెపిలకు వారి స్థాయి ఏమిటో చూపించింది. ప్రతిపక్షాలనన్నింటినీ ఏకం చేసి, 'ఇండియా' వేదిక నాయకుడిగా మాట్లాడిన తీరు, మరీ ముఖ్యంగా అధికార బిజెపి వారికి అర్థమయ్యేట్లు పురాణ ఘట్టాలను ఉదహరించి చేసిన ఆ ఉపన్యాసం తెలుగులో సంక్షిప్తంగా.

◆ ◆ ◆

స్పీకర్ సర్! నా ఉపన్యాసాలలో నేను తరచూ చెపుతూనే ఉన్నాను. ప్రస్తుత మన భారతదేశంలో భయపూరితమైన వాతావరణం ఉంది. అధికార పక్షంలో ఉన్న నా స్నేహితులు నవ్వుతున్నారు. కానీ, వాళ్ళు కూడా భయపడుతున్నారు. నాకు తెలుసు బిజెపిలో కేవలం ఒకే ఒక్క వ్యక్తి ప్రధాని కావడానికి కలలు కనొచ్చు. ఒకవేళ రక్షణ మంత్రి ప్రధాని కావాలనుకుంటే అక్కడ ఒక పెద్ద సమస్య ఉంది. అక్కడ కూడా భయం ఉంది. అదే భయాన్ని వారు దేశవ్యాప్తం చేశారు. అందుకే నన్ను నేను ఒక ప్రశ్న వేసుకుంటున్నాను. బిజెపి వారు దేశంలో భయాన్ని ఎందుకింత లోతుగా వ్యాప్తి చేశారూ? అని!

స్పీకర్ సర్! చక్రవ్యూహంలో భయం ఉంది. హింస ఉంది. అలాంటి చక్రవ్యూహంలో అభిమన్యుణ్ణి ట్రాప్ చేసి, ఒక ఆరుగురు చుట్టు ముట్టి, నిర్దాక్షిణ్యంగా చంపేశారు. నేను ఈ చక్రవ్యూహం గురించి కొంత పరిశోధన చేసి, తెలుసుకున్నదేమంటే - చక్రవ్యూహానికి మరొక పేరుందని, దాన్నే పద్మవ్యూహమంటారని !! అంటే ఆ వ్యూహం కమలం పువ్వు ఆకారంలో ఉంటుందట. లోటస్ ఫార్మేషన్-21వ శతాబ్దంలో కూడా ఒక కొత్త చక్రవ్యూహం- 'పద్మ'వ్యూహం తయారయ్యింది. అది కూడా కమలం పువ్వు ఆకారం లోనే ఉంటుంది. ఆ కమలం పువ్వు గుర్తునే మన దేశ ప్రధాని తన ఛాతీ మీద పెట్టుకుని తిరుగుతుంటాడు. ఆనాడు అభిమన్యుణ్ణి బంధించి, హింసించిన విధంగానే, ఈనాడు ఈ 'పద్మ' వ్యూహం కూడా ఈ దేశాన్ని బంధించింది. దేశంలోని రైతుల్ని, యువతీ యువకుల్ని, తల్లుల్ని, అక్కా చెల్లెళ్లను, చిన్న వ్యాపారస్థుల్ని, మధ్యతరగతి వ్యాపారస్థుల్ని బంధించింది. స్పీకర్ సర్...ఆనాడు మూకుమ్మడిగా అభిమన్యుణ్ణి చంపిన ఆరుగురు ఎవరంటే- ద్రోణాచార్య, కర్ణుడు, కృపాచార్య, కృతవర్మ, అశ్వద్ధామ, శకుని. ఈనాటి చక్రవ్యూహంలో కూడా ఆరుగురు ఉన్నారు. వారెవరంటే - నరేంద్ర మోడీ జీ, అమిత్‌షా జీ, మోహన్ భగవత్ జీ, అజిత్ దోవల్ జీ, అదానీ జీ, అంబానీ జీ.

ఈ 'పద్మ'వ్యూహపు ఉద్దేశమేమంటే-దేశ ఆర్థిక శక్తిని తమ ఆధీనంలో ఉంచుకోవడం. అదీ కేవలం ఇద్దరి దగ్గరే ఉండాలనుకోవడం. సరే ఇక ఇప్పుడైనా, ఈ బడ్జెట్‌లో గతంలో చేసిన తప్పిదాలు సవరించుకుంటారేమోనని అనుకున్నాం. కానీ అలా జరగలేదు. రైతులకు, యువతులకు ఈ బడ్జెట్ కొంత సహాయకారిగా ఉంటుందని భావించాం. కానీ, అలా జరుగలేదు. చిన్న, మధ్య తరగతి వ్యాపారస్థులకు మేలు జరగలేదు. వీరందరి జీవితాల్ని ఈ బడ్జెట్ ధ్వంసం చేసింది. ఇదంతా 'పద్మ'వ్యూహంలో భాగం. నోట్‌బందీ, జిఎస్టీ, టాక్స్ టెర్రరిజం - ఆపడానికి ఈ బడ్జెట్‌లో ఏ వెసులుబాటూ లేదు.

ఒక వైపు మీ పద్మవ్యూహం నిరుద్యోగాన్ని పెంచుతోంది. మరో వైపు మీ పద్మవ్యూహం పేపర్లు లీక్ చేస్తోంది. ఈ దేశపు యువత ఏమైపోవాలని అనుకుంటున్నారు. గత పదేళ్ళ మీ పాలనలో దేశంలో డెబ్బయి సార్లు పరిక్ష పేపర్లు లీక్ అయ్యాయి. యువతీ యువకులకు పేపర్‌లీక్ చాలా పెద్ద సమస్య దాన్ని ఎదుర్కోవడానికి, దాన్ని సరిచేయడానికి యువతకు న్యాయం చేయడానికి ఈ బడ్జెట్‌లో ఒక్కటంటే ఒక్క మాట కూడా లేదు. మరో విశేషమేమంటే మిమ్మల్ని మీరు దేశభక్తులని ప్రకటించుకుం టారు. కానీ, దేశ రక్షణ బాధ్యతను నిర్వహిస్తున్న అగ్నివీర్ జవాన్ల గురించి మీరు ఆలోచించరు. వారికి పెన్షన్ ఇవ్వడానికి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించరు. ఆ రకంగా మీరు మన సైనికుల్ని. 'అగ్నివీర్' అనే పద్మవ్యూహంలో ఇరికించారు.

అన్నదాతలైన రైతుల్ని నల్ల చట్టాల చక్రవ్యూహంలో బంధించారు. మీ పద్మవ్యూహం లోంచి బయట పడడానికి వారు ఒకే ఒక్క విషయం అడిగారు. లీగల్ గ్యారెంటీడ్ ఎం.ఎస్.పి. కావాలని డిమాండ్ చేశారు. దానిమీద మాట్లాడకపోగా, వారి రోడ్డు మూసేశారు. సరే, ఈ బడ్జెట్‌లో రైతులు అడిగిన ఒక్క కోర్కెను దృష్టిలో ఉంచుకుని కేటాయింపులు చేసి ఉంటే...వారు మీ పద్మవ్యూహం లోంచి కొంత వరకు బయట పడేవారు. కానీ, అది జరగలేదు.

> అవకాశం దొరికితో చాలు మీరు చక్రవ్యూహాలు ఏర్పాటు చేస్తారు. మేం మీ చక్రవ్యూహాన్ని, పద్మవ్యూహాన్ని బద్దలు కొట్టే పనిలో ఉన్నాం. భారతదేశంలో ప్రజలెవరూ కలలు కనగూడదని మీరు భావిస్తారు. కేవలం ఎ 1, ఎ 2 (అదానీ, అంబానీ) మాత్రమే కలలు కనడానికి అర్హులని మీరనుకుంటారు. ఆ ఇద్దరే దేశంలోని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంట్రోల్ చేస్తారు. వారి దగ్గరే టెలికామ్ సిస్టమ్ ఉంది. ఎయిర్ పోర్టులున్నాయి. ఇప్పుడిక రైల్వేలను ఆక్రమించాలనే ప్రయత్నంలో ఉన్నారు. సంపదకు సంబంధించిన ఏకఛత్రాధిపత్యం వీరి దగ్గరే ఉంది.

అవకాశం దొరికితో చాలు మీరు చక్రవ్యూహాలు ఏర్పాటు చేస్తారు. మేం మీ చక్రవ్యూహాన్ని, పద్మవ్యూహాన్ని బద్దలు కొట్టే పనిలో ఉన్నాం. భారతదేశంలో ప్రజలెవరూ కలలు కనగూడదని మీరు భావిస్తారు. కేవలం ఎ 1, ఎ 2 (అదానీ, అంబానీ) మాత్రమే కలలు కనడానికి అర్హులు అని మీరనుకుంటారు. ఆ ఇద్దరే దేశంలోని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంట్రోల్ చేస్తారు. వారి దగ్గరే టెలికామ్ సిస్టమ్ ఉంది. ఎయిర్ పోర్టులున్నాయి. ఇప్పుడిక రైల్వేలను ఆక్రమించాలనే ప్రయత్నంలో ఉన్నారు. సంపదకు సంబంధించిన ఏకఛత్రాధిపత్యం వీరి దగ్గరే ఉంది.

స్పీకర్ సర్! దేశంలో మరొక ముఖ్యమైన సమస్య ఉంది. దానిమీద ఈ బడ్జెట్ దృష్టి పెట్టలేదు. ఈ దేశంలో దళితుల, ఆదివాసీల, మైనార్టీల, వెనకబడిన వర్గాల సంఖ్య అధికం. సుమారు 90-95 శాతం. ప్రజలు వారే, అయితే వారికి ఎందులోనే స్థానం దొరకదు. పెద్దపెద్ద వ్యాపారాల్లోగానీ, ప్రభుత్వ యంత్రాంగంలో గానీ, ముఖ్యమైన చోట్ల ఎక్కడా వారికి తగిన స్థానం దొరకదు. అందుకే దేశంలోని 95 శాతం ప్రజలు 'జనగణన' కోరుతున్నారు. అప్పుడు గానీ, ప్రతి దాంట్లో వారివారి భాగస్వామ్యం ఎంత అనేది బయటపడదు.

ఈ సారి బడ్జెట్ తయారు చేసిన వారిలో 20 మంది అధికారులున్నారని తెలిసింది. అందులో ఒకరు మైనార్టీ మరొకరు ఒబిసి, అంటే 95 శాతం ప్రజలకు ప్రతినిధులు ఇద్దరయితే 5 శాతానికి 18 మంది ఉన్నారు. ఉన్న ఆ ఇద్దరిని కూడా ఇక్కడ ఫోటోలోకి రాకుండా అడ్డుకుని, వెనక్కి నెట్టేశారు (పార్లమెంట్‌లో ఈ ఫోటో చూపించారు). ఎందుకీ వివక్ష అని మేమడుగుతున్నాం. మీ పద్మవ్యూహాల్ని బద్దలు కొట్టడానికే మేం బయలుదేరాం! మేం అదే పనిలో ఉన్నాం!! స్పీకర్ సర్.

మీ కుటిల పద్మవ్యూహాల్ని ఛేదించుకుని ఈ దేశ ప్రజలు తప్పక బయట పడతారు. పద్మవ్యూహాలు పన్నిన వారిని తుత్తునియలు చేస్తారు.

/ తెలుగుసేత: డాక్టర్ దేవరాజు మహారాజు,
కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త /

జనవాక్యం

బాబోయ్..
సిలబస్ భారం...

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోషల్, ఇంగ్లీష్ సబ్జెక్టులు భారంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. సోషల్‌కు నాలుగు పాఠ్య పుస్తకాలు, ఇంగ్లీష్‌కు మూడు పుస్తకాలు ఉన్నాయి. గతంలో ఇంగ్లీష్‌కు ఒకే పాఠ్య పుస్తకం ఉండేది. ఇప్పుడు టెక్స్ట్‌బుక్‌కు అదనంగా ఉప వాచకం, వర్క్ బుక్ కూడా వచ్చి చేరాయి. ఉపాధ్యాయులు తమకున్న పని దినాల్లో సిలబస్ పూర్తి చేయడం, రివిజన్ చేయడం సాధ్యమయ్యే పని కాదు. పబ్లిక్ పరీక్షల దృష్ట్యా గతంలో డిసెంబర్ లేదా జనవరి మొదటి వారం కల్లా సిలబస్ పూర్తి చేయమని విద్యా శాఖాధికారులు మౌఖిక ఆదేశాలు ఇచ్చేవారు. అప్పట్లో సిలబస్ కొంత తక్కువగా ఉండటం వల్ల ఉపాధ్యాయ సిబ్బంది త్వరగా సిలబస్ పూర్తి చేసేవారు. రివిజన్ చేయించేవారు. ప్రస్తుత పరిస్థితులలో ఇది సాధ్యం కాకపోవచ్చు. కాబట్టి విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని సిలబస్‌ను తగ్గించాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

- యం. రాంప్రదీప్

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

బిబిఎ, బిసిఎ కోర్సులకు ఫీజుల ఖరారు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశపెట్టిన బిబిఎ, బిసిఎ కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజులను నిర్ధారించింది. ఈ మేరకు జిఓ 45ను ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ గురువారం విడుదల చేశారు. రాష్ట్రంలో మూడు కళాశాలల్లో ఈ కోర్సులకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. గుంటూరులోని ఆర్‌విఆర్ జెసి, నెల్లూరులోని జెనెక్స్ విజన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అండ్ టెక్నాలజీ కళాశాలల్లో ప్రవేశపెట్టిన బిబిఎ కోర్సులకు రూ.18 వేలు, అనకాపల్లిలోని దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలోని బిసిఎ కోర్సుకు రూ.18 వేల చొప్పున నిర్ధారించారు.

HDB FINANCIAL SERVICES — హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: రాధికా, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్డు, నవ్‌రంగపుర, అహ్మదాబాద్-380009.
శాఖా కార్యాలయం: #76-8-10/1, ఫ్లాట్ నెం. 4, భవాని టవర్స్, స్వాతి థియేటర్ రోడ్డు, యునియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్కన, భవానిపురం, విజయవాడ-520012.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(13) తో చదువుతూ సెక్షన్ 13(2) క్రింద నోటీసు.

[illegible]

: అడుసుమిల్లి నరసింహారావు ఆస్తి, **తూర్పు :** గడ్డం శేషగిరిరావు ఆస్తి, **పడమర :** పంచాయతీ రోడ్డు. వ్యక్తిగత భవనం విస్తీర్ణం 215.11 చ.గ.లు. లేదా 179.85 చ.మీ.లు. సైట్ తో పాటు వ్యక్తిగత ఆర్‌సిసి భవనం.

తేది: 02-08-2024, ప్రదేశం: గుంటూరు — సం/-అధీకృత అధికారి, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

पावरग्रिड POWERGRID

నోటీసు

1. సిఇఆర్‌సి (వ్యాపార ప్రవర్తన) నిబంధనలు' 1999 మరియు సిఇఆర్‌సి (టారిఫ్ నిబంధనలు మరియు షరతులు) రెగ్యులేషన్స్' 2019 1) 2019-24 కొరకు ట్రాన్స్‌మిషన్ టారిఫ్‌ను సరిదిద్దడం మరియు 2) 2024 కొరకు ట్రాన్స్‌మిషన్ టారిఫ్‌ని నిర్ణయించడం-86 కింద ఆమోదం **పిటీషన్-1 కొరకు 29 టారిఫ్ బ్లాక్: పశ్చిమ ప్రాంతంలో ఎస్ఆర్ మరియు డబ్ల్యూ మధ్య సమకాలిక ఇంటర్‌కనెక్షన్.**
2. పైన పేర్కొన్న ట్రాన్స్‌మిషన్ సిస్టం యొక్క లబ్ధిదారులు: (1) MPPMCL జబల్‌పూర్ (2) MPPTCL జబల్‌పూర్ (3) MPIDC, ఇండోర్ (4) MSEDCL, ముంబై (5) MSETCL, ముంబై (6) GUVNL, వడోదర (7) విద్యుత్ శాఖ, గోవా ప్రభుత్వము, పనాజి (8). DNHDDPCL, శిల్వస్స (9) CSPTCL, రాయ్‌పూర్ (10) CSPDCL, రాయ్‌పూర్ (11) GPCL, గాంధీనగర్ (12) TANGEDCO (13) APTRANSCO (14) KSEB (15) TNEB (16) విద్యుత్ శాఖ, పాండుచ్చేరి (17) APEPDCL (18) APSPDCL (19) APCPDCL (20) APNPDCL (21) TGSPDCL (22) TGNPDCL (23) BESCOM (24) GESCOM (25) HESCOM (26) MESCOM (27) చాముండేశ్వరి ఎలక్ట్రిసిటీ సప్లయి కార్పొరేషన్ లిమిటెడ్ (28) TGTRANSCO (29) TANTRANSCO (30) KPTCL (31) రాయ్‌చూర్ షోలాపూర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్

3. టారిఫ్ వివరాలు :

ఎ) 2019-24 బ్లాక్

(రూ. లక్షలలో)

పిటీషన్ నం.	ఆస్తి వివరాలు	డిఓసిఓ	31.03.2024 నాటికి పూర్తి ఖర్చు		2019-20	2020-21	2021-22	2022-23	2023-24
పిటీషన్ -1	సంయుక్త ఆస్తి	01.07.2014	8072.13	ట్యూయింగ్ అప్ ఆధారంగా సవరించబడిన ఎఎఫ్‌సి	1398.78	1353.79	1321.37	1297.70	1276.36

బి) 2024-29

(రూ. లక్షల్లో)

పిటీషన్ నం.	ఆస్తి వివరాలు	31.03.2024 నాటికి పూర్తి ఖర్చు		2024-25	2025-26	2026-27	2027-28	2028-29
పిటీషన్ -1	సంయుక్త ఆస్తి	8072.13	AFC	1320.25	1298.30	1267.91	994.98	1000.15

4. ఒక కాపీ అప్లికేషన్‌ను తయారుచేసి సుంకం నిర్ధారణకు వెబ్‌సైట్‌కు www.powergrid.in అప్లికేషన్‌ను పోస్టుచేయాలి.
5. సలహాలు మరియు అభ్యంతారాలు, అప్లికేషన్‌లో ఉన్న సుంకాన్ని నిర్ణయించే ప్రతిపాదనలపై ఏవైనా సూచనలు మరియు అభ్యంతరాలు ఉంటే, లబ్ధిదారుడితో సహా ఏ వ్యక్తి అయినా సెక్రటరీ, సెంట్రల్ ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమీషన్, 6వ, 7వ మరియు 8వ అంతస్తు, టవర్ బి, వరల్డ్ ట్రేడ్ సెంటర్, నౌరోజి నగర్, న్యూ ఢిల్లీ-110029 (లేదా వేరొక చిరునామ కమీషన్ కార్యాలయం ఎక్కడ ఉన్నదో అక్కడ) ఒక కాపీతో అప్లికెంట్ దీని కార్పొరేట్ ఆఫీస్ వద్ద నోటీసు ప్రచురించబడిన 30 రోజులలోగా తెలుపవచ్చు.

ప్రదేశం: గుర్‌గావ్
తేది: 31.07.2024

సం/-
జనరల్ మేనేజర్ (కమర్షియల్)

PG/CC/Notice-29/Advt-44/2024-25/Associated

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
కార్పొరేట్ కార్యాలయం: "సౌధామిని", ఫ్లాట్ నం.2, సెక్టార్-29, గుర్‌గావ్-122001 (హర్యానా) టెలి: 0124-2571700-719
నమోదిత కార్యాలయం : బి-9, క్వాతబ్ ఇనిస్టిట్యూషనల్ ఏరియా, కట్వారియా సరయి, న్యూ ఢిల్లీ-110 016 టెలి: 011-26560112, 26560121
వెబ్‌సైట్: www.powergrid.in సిఐఎన్: L40101DL1989GOI038121
ఎ మహారత్న పిఎస్‌యు

HDB FINANCIAL SERVICES — హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : రాధిక, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్, నవరంగ్‌పుర, అహ్మదాబాద్-09.
శాఖా కార్యాలయం : #76-8-10/1, ఫ్లాట్ నం.4, భవాని టవర్స్, స్వాతి థియేటర్ రోడ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, భవానిపురం, విజయవాడ-520012.

ఇ-వేలం విక్రయ నోటీసు

(రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/సాధారణ ప్రజలకు) (సర్ఫేసీ యాక్ట్, 2002 యొక్క రూల్ 9 (1)తో చదువుతూ రూల్ 8(6) క్రింద)

దిగువ సంతకందారు హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ది ఫైనాన్షియల్ అసెట్స్ [illegible] "ఏది ఎక్కడ ఎలా ఉన్నది మరియు అది అక్కడ అలాగ ప్రాతిపదికన" పాటిస ప్రక్రియించబడుతుంది.

1: దరఖాస్తుదారు మరియు సహ దరఖాస్తుదారు పేరు మరియు చిరునామా: 1) శ్రీ నాగేశ్వరి గోల్డ్ వర్క్స్, డో.నం.11-57/1-27, షాప్ నం.1-12, కొట్ల కాంప్లెక్స్, చాకలి సందు, శివాలయం వీధి, విజయవాడ-520002, ఆంధ్రప్రదేశ్. ఇక్కడ కూడా : డో.నం.1-1155, డో.నం.283/ఎ1, వార్డు నం.1, మూల్యాంకనం నం.1023001504, జిటి రోడ్డు, శ్రీనివాస మహల్ రోడ్డు, మంగళగిరి, గుంటూరు-522003. ఇక్కడ కూడా : నం.1-1175, మున్సిపల్ వార్డు నం.1, మూల్యాంకనం నం.1023006775, డో.నం.276/బి1, బస్టాండ్ వద్ద, జిటి రోడ్డు, మంగళగిరి, గుంటూరు-522503. 2. కంచర్ల శివ శంకర్, డో.నం.1-1175, పార్కు రోడ్డు, 1వ లైన్, శ్రీనివాస మహల్ వెనుక, మంగళగిరి, గుంటూరు-522503, ఆంధ్రప్రదేశ్. 3. కంచర్ల వెంకటలక్ష్మి, డో.నం.1-1175, పార్కు రోడ్డు, 1వ లైన్, శ్రీనివాస మహల్ వెనుక, మంగళగిరి, గుంటూరు-522503, ఆంధ్రప్రదేశ్.

ఖాతా నం.లు 6519237/29998559,, పూర్తి బకాయి మొత్తాలు: 29 జులై, 2024 నాటికి **రూ.1,06,08,731/-** (ఒక కోటీ ఆరు లక్షల ఎనిమిది వేల ఏడు వందల ముప్పై ఒక్క రూపాయలు మాత్రమే). **సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తెలిసిన ఏవేని రుణభారాల వివరాలు: ..... నిల్.**

స్థిరాస్తుల వివరాలు :

అంశం నం.1 కమర్షియల్ ఆస్తి : షెడ్యూల్ : స్థిరాస్తి వివరణ : ఎ.పి., గుంటూరు జిల్లా, ఎస్ఆర్ఓ మంగళగిరి అధికార పరిధిలోని మంగళగిరి గ్రామం, మున్సిపల్ వార్డు నం.1 వద్ద ఉన్న ఆర్.సి.సి. రూఫ్డ్ భవనం కలిగి ఉన్న గ్రౌండ్ మరియు ఒకటవ అంతస్తుల నిర్మాణం బేరింగ్ డో.నం.1-1175, డో.నం.276/బి1 60 చ.గ.లు. లేదా 50.16 చ.మీ.లు. హద్దులు : ఉత్తరం : పసుపులేటి నరసింహారావు ఆస్తి, దక్షిణం : మున్సిపల్ బజారు, తూర్పు : మున్సిపల్ బజారు, పడమర : మున్సిపల్ బజారు.

రిజర్వు ధర	బయానా మొత్తం	బిడ్ పెంపుదల మొత్తాలు	వేలం తేది మరియు సమయం	ఇఎమ్‌డికు చివరి తేది మరియు సమయం
Rs. 43,66,280/-	Rs. 4,36,628/-	Rs.1,00,000/-	31-08-2024 at 11 AM to 12 Noon	30-08-2024 up to 05:00 p.m

అంశం నం.2 రెసిడెన్షియల్ ఆస్తి : ఎ.పి., గుంటూరు జిల్లా, మంగళగిరి ఎస్ఆర్ఓ అధికార పరిధిలోని మంగళగిరి గ్రామం, మున్సిపల్ వార్డు నం.1 వద్ద ఉన్న ఆర్.సి.సి. రూఫ్డ్ భవన నిర్మాణం బేరింగ్ డో.నం.1-1155, డో.నం.283/ఎ1ఎ విస్తీర్ణం 105 చ.గ.లు. లేదా 87.87 చ.మీ.లు. హద్దులు : ఉత్తరం : షేక్ బీబి జాన్ ఆస్తి 28.8" అ.లు., దక్షిణం : మున్సిపల్ బజారు 28.8" అ.లు., తూర్పు : మున్సిపల్ బజారు 33.6" అ.లు.

రిజర్వు ధర	బయానా మొత్తం	బిడ్ పెంపుదల మొత్తాలు	వేలం తేది మరియు సమయం	ఇఎమ్‌డికు చివరి తేది మరియు సమయం
Rs.32,02,560/-	Rs.3,20,256/-	Rs.1,00,000/-	31-08-2024 at 11 AM to 12 Noon	30-08-2024 up to 05:00 p.m

టెండరు కం వేలం అమ్మకపు షరతులు మరియు నిబంధనలు:

1. 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో పై పట్టికలో పేర్కొన్న తేదీలలో వెబ్‌సైట్ https://www.bankeauctions.com లేదా యాక్షన్ టైగర్ మొబైల్ యాప్ ద్వారా "ఆన్‌లైన్ ఇ-వేలం" బిడ్డింగ్ ద్వారా వేలం అమ్మకం ఉంటుంది. **2.** ఆసక్తిగల బిడ్డరుదారు లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్ ద్వారా వెబ్ పోర్టల్ : https://www.bankeauctions.com తో (https://www.bankeauctions.com . తో పేరును రిజిస్టర్ చేయుటతో ఉచితంగా యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను పొందవచ్చును) పైన ఉన్న "హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీస్ లిమిటెడ్"కి అనుకూలంగా డ్రా చేయబడిన రిజర్వ్ ధరలో 10% ఇఎమ్‌డి కోసం ఆర్డర్/డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ఇఎమ్‌డి చెల్లించబడుతుంది. వెబ్ పోర్టల్‌లో బిడ్డర్ నమోదు చేసిన తర్వాత (ఒకసారి), బిడ్ డాక్యుమెంట్‌లను సమర్పించే చివరి తేదీ మరియు సమయానికి ముందు వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలనుకుంటున్న బిడ్డర్/కొనుగోలుదారు కింది పత్రాల కాపీలను పొందవలసి ఉంటుంది. 1) ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ చలాన్ లేదా డిమాండ్ డ్రాఫ్ట్ కాపీ; 2) పాన్ కార్డ్ యొక్క కాపీ; 3) గుర్తింపు రుజువు/ చిరునామా రుజువు (కెవైసి) అనగా. ఓటరు ఐడి కార్డ్/ డ్రైవింగ్ లైసెన్స్/ పాస్‌పోర్ట్ మొదలైన వాటి యొక్క స్వీయ-ధృవీకరించబడిన కాపీ; అది లేకుండా బిడ్ తిరస్కరించబడుతుంది. అనుబంధం-2 మరియు 3 యొక్క స్కాన్ చేసిన కాపీని అప్‌లోడ్ చేయడం (వెబ్ పోర్టల్ https://www.bankeauctions.com నుండి [illegible]

ప్రదేశం : విజయవాడ, తేది : 02-08-2024 — సం/- అధీకృత అధికారి, మెసర్స్. హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

హిమాచల్‌లో కుంభవృష్టి

- ముగ్గురు మృతి, 50 మంది పైగా గల్లంతు
- ఉత్తరాఖండ్‌లోనూ భారీ వర్షాలు, ఏడుగురు మృతి
- దేశమంతటా వర్షాలు
- ఢిల్లీలో ముగ్గురు మృతి, భవనాలు ధ్వంసం

హిమాచల్ ప్రదేశ్ కులు జిల్లాలో పొంగి ప్రవహిసున్న బియాస్ నది

న్యూఢిల్లీ : దేశమంతటా వానలు దంచికొడుతున్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో మేఘవిస్ఫోటనం జరిగి షిమ్లా, మండి, కులు జిల్లాలో గత 24 గంటల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు నదులన్నీ పొంగిపొరులుతూ దిగువ రాష్ట్రాల వైపు ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా హిమాచల్‌ప్రదేశ్‌లో ఇద్దరు మృతి చెందగా, 50 మందికి పైగా గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. భారీ వర్షాలకు రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, సహాయక చర్యల కోసం ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ నుంచి సహాయం కోసం చూస్తున్నామని ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు తెలిపారు. రాబోయే 36 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రస్తుతం ఉధృతంగా ప్రవహిస్తున్న నదులకు దూరంగా ఉండాలని ప్రజలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. షిమ్లా డిప్యూటీ కమిషనర్ అనుపమ్ కశ్యప్ మాట్లాడుతూ గురువారం తెల్లవారుజామున ఒంటి గంటకు సంభవించిందని, భారీ వర్షాలకు రోడ్లన్నీ కొట్టుకు పోవడంతో రెస్క్యూ ఆపరేషన్ క్లిష్టంగా మారిందని తెలిపారు. ఉత్తరాఖండ్‌నూ భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో ఏడుగురు మరణించారు. ఇందులో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు. అనేక మంది గాయపడ్డారు. నలుగురు గల్లంతయ్యారు. భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోవడం, నదుల్లో నీటిమట్టం పెరిగి ఆకస్మిక వరదలు, అనేక వాహనాలు కొట్టుకుని పోవడం వంటి ఘటనలు జరిగాయి. కేదార్‌నాథ్‌కు వెళ్లే మార్గంలో చిక్కుకుపోయిన యాత్రికులను హెలిక్టాపర్ ద్వారా రక్షించారు. రహదారిని పునరుద్దరించే వరకూ కేదార్‌నాథ్ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు. దాదాపు అన్ని జిల్లాలోనూ గురువారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

దేశరాజధానిని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా ఢిలీల్లో ముగ్గురు మరణించారు. అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయి. భారీ సంఖ్యలో వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయి. ఇక రోడ్లన్నీ జలమయం కావడం అంతులేని ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఢిల్లీలోని విద్యా సంస్థలకు గురువారం సెలవు ప్రకటించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లోనే బయకు రావాలని అధికారులు కోరారు. అలాగే, మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. తమిళనాడులోని నీలగిరి జిల్లా ఈ నెల 3 వరకూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఈ ప్రాంతాన్ని సందర్శించాలనుకునే పర్యాటకులు తమ పర్యటనను వాయిదా వేసుకోవాలని అధికారులు కోరారు.

రూ.18 కోట్లతో నూజివీడు మామిడి మార్కెట్

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రూ.18 కోట్లతో నూజివీడు మామిడి మార్కెట్‌ను పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలతో అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. మామిడి మార్కెట్‌ను అగ్రికల్చర్ మార్కెటింగ్ యార్డుకు అనుసంధానం చేస్తామని చెప్పారు. మార్కెట్ యార్డులో ట్రేడర్స్, మార్కెటింక్ సిబ్బందితో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెటింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లేశ్వరరావుతో ప్లాన్ ఆఫ్ యాక్షన్, అంచనా విలువ యార్డు డ్రాయింగ్ మ్యాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుమారు 41 వేల మీటర్ల సువిశాలమైన మార్కెటింగ్ యార్డులో రెండు షెడ్డులు, మామిడి రైతులకు సదుపాయాల కోసం 70 షాపులు, లారీ కాట, సీసీ రోడ్లు, నూజివీడు మామిడి మార్కెటింగ్ కావాల్సిన అన్ని మౌలిక సదుపాయలను రానున్న మామిడి సీజన్‌కి కల్పిస్తామన్నారు. దీంతో నూజివీడు మామిడికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి, రైతులకు ఆర్థిక ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. ఈ యార్డు ద్వారా నూజివీడు పట్టణ వాసులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. గతంలో నున్న మార్కెట్‌కి తీసుకెళ్లే రైతులు, ట్రేడర్స్ వచ్చే సీజన్ నుంచి నూజివీడు యార్డుకు మామిడి తరలించి ఇక్కడే కొనుగోలు, అమ్మకాలు నిర్వహించి మార్కెట్, నూజివీడు అభివృద్ధికి సహకరించాలని సూచించారు. వచ్చే సీజన్‌లో మామిడి మార్కెటింగ్ ఇక్కడి నుంచే ప్రారంభిస్తే మరిన్ని గ్రాంట్లు తెచ్చి మరింత అభివృద్ధి చేసే బాధ్యత తనది అని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో ఎంతో మంది పని చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. నూజివీడుకు ఆదాయం పెరిగి అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందన్నారు. రైతుల వాహనాల పార్కింగుకు ప్రత్యేక స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సెక్రటరి యు.మహాలక్ష్మి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లేశ్వరరావు, ఎఇ శ్రీనివాస్, ట్రేడర్స్ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

కష్టాల... ఖరీఫ్..!

- పదును కోసం ఎదురుచూపు
- కడపలో 22, అన్నమయ్యలో 18 శాతమే విత్తనం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

1. 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో పై పట్టికలో పేర్కొన్న తేదీలలో వెబ్‌సైట్ **https://www.vehicleduniya.com** లేదా యాక్షన్ టైగర్ మొబైల్ యాప్ ద్వారా "ఆన్‌లైన్ ఇ-వేలం" బిడ్డింగ్ ద్వారా వేలం అమ్మకం ఉంటుంది. **2.** ఆసక్తిగల బిడ్డరుదారు లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్ ద్వారా వెబ్ పోర్టల్ : **www.vehicleduniya.com తో (https://www.bankeauctions.com** తో పేరును రిజిస్టర్ చేయుటతో ఉచితంగా యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను పొందవచ్చును) పైన ఉన్న "హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీస్ లిమిటెడ్"కి అనుకూలంగా డ్రా చేయబడిన రిజర్వ్ ధరలో 10% ఇఎమ్‌డి కోసం ఆర్డర్/డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ఇఎమ్‌డి చెల్లించబడుతుంది. వెబ్ పోర్టల్‌లో బిడ్డర్ నమోదు చేసిన తర్వాత (ఒకసారి), బిడ్ డాక్యుమెంట్‌లను సమర్పించే చివరి తేదీ మరియు సమయానికి ముందు వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలనుకుంటున్న బిడ్డర్/కొనుగోలుదారు కింది పత్రాల కాపీలను పొందవలసి ఉంటుంది. 1) ఎన్‌ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ చలాన్ లేదా డిమాండ్ డ్రాఫ్ట్ కాపీ; 2) పాన్ కార్డ్ యొక్క కాపీ; 3) గుర్తింపు రుజువు/ చిరునామా రుజువు (కెవైసి) అనగా. ఓటరు ఐడి కార్డ్/ డ్రైవింగ్ లైసెన్స్/ పాస్‌పోర్ట్ మొదలైన వాటి యొక్క స్వీయ-ధృవీకరించబడిన కాపీ; అది లేకుండా బిడ్ తిరస్కరించబడుతుంది. అనుబంధం-2 మరియు 3 యొక్క స్కాన్ చేసిన కాపీని అప్‌లోడ్ చేయడం (వెబ్ పోర్టల్ **www.vehicleduniya.com** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు: అప్పుడు సరిగ్గా పూరించిన తర్వాత మరియు సంతకం చేయడం కూడా అవసరం. లానిగ్ ఐడి మరియు పాస్‌వర్డ్ నెలకొల్పుట, డేటా అప్‌లోడింగ్‌చేయుట, బిడ్ పత్రాలు సమర్పించుట, ఆన్‌లైన్ ఇంటర్‌సే బిడ్డింగ్‌పై శిక్షణ/డిమానుస్ట్రేషన్ మొ॥వాటిలో కావలసిన సహకారానికి సంప్రదించండి: **మెసెర్స్. ఆర్ఎఫ్‌సి వెహికల్ దునియ ప్రైవేట్ లిమిటెడ్, పి3/56 పిడిఎఫ్ ఫేజ్ 2 గుర్గావ్ హర్యాణ-122001. ఇమెయిల్ ఐడి: property@vehicleduniya.com, సపోర్ట్ హెల్ప్‌లైన్ నంబర్లు : ప్రతాప్ సింగ్ రాజ్‌పూత్, pratap@vehicleduniya.com, 8860426010, yogesh@vehicleduniya.com, 9109689799. 3.** వేలానికి ఉద్దేశించిన బిడ్డర్లు వ్యక్తిగతంగా హాజరు కావాలి మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అతను/ఆమె తన కోసం వేలం వేస్తున్నట్లు లిఖితపూర్వకంగా డిక్లరేషన్ ఇవ్వాలి. అధీకృత వ్యక్తిని అనుమతించలేదు. **4.** ఉద్దేశించిన బిడ్డర్లు మేనేజర్, మెసెర్స్. హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, 76-8-10/1, ఎఫ్.నం-4, భవాని టవర్స్, స్వాతి థియేటర్ రోడ్డు, భవానిపురం, విజయవాడ-520012, వేలం వేదిక : 76-8-10/1, ఎఫ్.నం-4, భవాని టవర్స్, స్వాతి థియేటర్ రోడ్డు, భవానిపురం, విజయవాడ-520012 నుండి టెండర్ ఫారములను పొందగలరు. **5.** ఉద్దేశించిన బిడ్డర్‌లు తమ బిడ్‌లను అధీకృత అధికారి, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌కు సంబోధించిన సీల్డ్ ఎన్వలప్‌లలో సూచించిన టెండర్ ఫారమ్‌లో, రిజర్వ్ ధరలో 10 శాతం ఇఎమ్‌డి కొరకు పే ఆర్డర్/డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు సమర్పించాలి. "హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీస్ లిమిటెడ్" కొరకు 16-07-2024న సాయంత్రం 6 గంటలలోపు లేదా టెండర్-కమ్-వేలం విక్రయానికి అనుకూలంగా డ్రాని చేయడం ద్వారా తెలియజేయబడింది. **6.** ఆస్తి మరియు ఇతర వివరాల తనఖీ కొరకు, మెసెర్స్. హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, 76-8-10/1, ఎఫ్.నం-4, భవాని టవర్స్, స్వాతి థియేటర్ రోడ్డు, భవానిపురం, విజయవాడ-520012 - మహమ్మద్ జమాలుద్దీన్ (891959570) మరియు రాఘవేంద్ర (9848102103), (7386748107) మరియు చింతపల్లి సతీష్ (9000249815). సంప్రదించగలరు "ఎక్కడ ఉన్నాయో" మరియు " ఏమి ఉన్నాయో" ఆధారంగా ఆస్తులు విక్రయించబడతాయి. **7.** టెండర్-కమ్-వేలం విక్రయం 17-08-2024న ఉదయం 10:30 గం.కు ఉద్దేశించిన బిడ్డర్‌ల సమక్షంలో సీలు చేయబడిన టెండర్‌లు తెరవబడతాయి. సాధారణంగా క్లోజ్డ్ టెండర్ల ద్వారా అదే జరిగినప్పటికీ, అధీకృత అధికారి తన స్వంత అభీష్టానుసారం, క్లోజ్డ్ టెండర్ ప్రక్రియలో అందుకున్న దానికంటే ఎక్కువ బిడ్‌ను కోట్ చేయాలనుకునే ఆసక్తిగల బిడ్డర్‌ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చు. ఒక ఈవెంట్, అత్యధిక బిడ్ చేసిన వ్యక్తికి విక్రయం ఇవ్వబడుతుంది. అయితే, విక్రయం హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క నిర్ధారణకు లోబడి ఉంటుంది. **8.** విజయవంతమైన బిడ్డర్ సేల్ మొత్తంలో 25% (చెల్లించిన ఇఎమ్‌డితో సహా) వెంటనే అదే రోజున లేదా తర్వాత పని దినం కంటే అమ్మకం పూర్తయిన తర్వాత మరియు 75% బ్యాలెన్స్ మొత్తాన్ని ధృవీకరించిన అమ్మకం తేదీ నుండి 15 రోజులలోపు చెల్లించాలి. విఫలమైతే 25% ప్రారంభ డిపాజిట్ జప్తు చేయబడుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ అది తిరిగి చెల్లించబడదు. విజయవంతమైన బిడ్డర్, పైన పేర్కొన్న మొత్తం బిడ్ మొత్తంలో 25% చెల్లింపు చేయడంలో విఫలమైతే, తదుపరి విజయవంతమైన బిడ్డర్ పరిగణించబడతారు మరియు విక్రయాన్ని పూర్తి చేయడానికి అర్హులు. **9.** ఇక్కడ నిర్దేశించిన కాల పరిమితిలోపు మొత్తం విక్రయ పరిశీలనను స్వీకరించిన తర్వాత మాత్రమే విజయవంతమైన కొనుగోలుదారుకు అనుకూలంగా అధీకృత అధికారి ద్వారా విక్రయ ధృవీకరణ పత్రం జారీ చేయబడుతుంది. **10.** విజయవంతమైన కొనుగోలుదారు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము మొదలైనవి వంటి రవాణా కోసం చెల్లించాల్సిన ఛార్జీలు/ఫీజులను చట్టం ప్రకారం వర్తించవచ్చు. **11.** విజయవంతమైన బిడ్డర్ చట్టబద్ధమైన బకాయిలు (చట్టబద్ధమైన ఇంటి పన్ను, విద్యుత్ ఛార్జీలు మరియు ఇతర బకాయిలు), టిడిఎస్, జిఎస్‌టి ఏదైనా ఉంటే, ప్రభుత్వం, ప్రభుత్వ బాధ్యతలు మరియు స్థానిక సంస్థలకు చెల్లించాలి. **12.** అధీకృత అధికారికి టెండర్‌ను అంగీకరించడానికి లేదా తిరస్కరించడానికి లేదా ఏదైనా లేదా అన్ని ఆఫర్‌లను బిడ్ చేయడానికి మరియు ఏ కారణం చెప్పకుండానే వేలాన్ని మార్చడానికి/వాయిదా వేయడానికి/రద్దు చేయడానికి మరియు ఎటువంటి కారణం చూపకుండా విక్రయానికి సంబంధించిన ఏవైనా నిబంధనలు మరియు షరతులను సవరించడానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా అమ్మకానికి సంబంధించిన షరతులను సవరించడానికి సంపూర్ణ హక్కు ఉంటుంది.

ప్రదేశం : తెనాలి, తేది : 02-08-2024 సం/- అధీకృత అధికారి, మెసెర్స్. హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

మృతదేహాలను తరలిస్తున్న డివైఎఫ్ఐ వాలంటీర్లు

వయనాడ్‌లోని చురల్‌మలలో కొండచరియల బాధితులను పరామర్శించేందుకు తాత్కాలిక వంతెనపై వెళ్తున్న ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ

నాన్న చనిపోయిన రోజు అంతటి దుఃఖం వేసింది : రాహుల్

తన తండ్రి చనిపోయిన నాటి రోజు ఎంత దుఃఖం వేసిందో వయనాడ్ విషాద ఘటనతో అంతే దుఃఖం వేసిందని పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. బాధితులను పలకరిస్తుంటే తనకు నాటి విషాదామే మదిలో మెదిలిందన్నారు. చాలా మంది మొత్తం కుటుంబాన్ని కోల్పోయారని, వారి బాధ చెప్పడానికి మాటలు చాలడం లేదని రాహుల్ చెప్పారు. ఈ విషాద సమయంలో రాజకీయాలకు ఏమాత్రం తావు లేదని, దేశం మొత్తం వయనాడ్‌కు, కేరళకు తోడుగా నిలువాల్సిన సమయమిది అని ఆయన అన్నారు. ఇక్కడి ప్రజానీకానికి తాను, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ శ్రేణులు అందరం సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇలాంటి విపత్తులను నివారించడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అత్యవస్యమని ఆయన చెప్పారు.

డివైఎఫ్ఐ సాహసోపేత సేవలు

మలప్పురం: వయనాడ్ విపత్తులో ఇరుక్కున్న వారి కోసం చేస్తున్న గాలింపు చర్యల్లో కేరళ యువజన సంఘం (డివైఎఫ్ఐ) వాలంటీర్లు చేయి చేయి కలిపి అవిశ్రాంతంగా కషి చేస్తున్నారు. కేరళలోని కొడుమ్‌కటలోని వన్‌ట్రాక్ మార్గం గుండా నడక సాగుతుంది. ఇద్దరు వ్యక్తులు ఆయుధాలతో దారి తీస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు మతదేహాన్ని ఒక గుడ్డలో చుట్టి, చెక్క కొయ్యకు కట్టి తీసుకువెళుతున్నారు. దాని వెనుక ముగ్గురు వ్యక్తులు.

డివైఎఫ్ఐ యూత్ బ్రిగేడ్ వాలంటీర్లు ఎంతో సాహసంతో మతదేహాలను బయటకు తీస్తున్నారు. 150 మందిని మూడు గ్రూపులుగా విభజించారు. ఓ మృతదేహాన్ని, 13 మంది అవయవాలను అడవి నుంచి బయటకు తీసుకొచ్చారు. ఎడక్కర, వంతూర్, అరికోట్ మరియు మంచిరి బ్లాక్‌లకు చెందిన వాలంటీర్లు కుంబళప్పర నగర్ పైన తొమ్మిది కిలోమీటర్ల అడవిలో ప్రయాణించి శోధనను నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం మిషన్‌తో అడవిలోకి వెళ్లారు. ఉదయం ఐదు గంటలకు పోతుకల్ వద్ద కేంద్రీకరించారు. ఆరింటికి ముండేరి పొలం చేరుకున్నారు. మొదటి బందం డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.షబీర్ ఆధ్వర్యంలో ఆరు గంటలకు అడవికి వెళ్లారు. రెండవ బందం ఆరున్నర గంటలకు మరియు మూడవ బందం ఏడు గంటలకు బయలుదేరింది. చెట్టులో ఇరుక్కుపోయిన మతదేహం లభ్యమైంది. శవాలను మరియు శరీర భాగాలను వానియంపూజ వార్ఫ్‌కు తీసుకువచ్చి రబ్బర్ డింగీలో చలియార్ రవాణా చేశారు. 'ఎక్కడ చూసినా చేతులు, కాళ్లు, తెగిపడిన తలలు గుండెను పిండేసే దశ్యం. గ్యాస్ సిలిండర్లు, గహోపకరణాలు కూడా నదిలో చాలా చోట్ల పడి ఉన్నాయి' అని పి షబీర్ తెలిపారు. నిలంబూర్ బ్లాక్ నుండి 50 మంది వాలంటీర్లు కూడా స్వచ్ఛందంగా నిలంబూర్ జిల్లా ఆసుపత్రిలో పని చేస్తున్నారు.

అమిత్ షాపై రాజ్యసభ చైర్మన్‌కు సిపిఎం లేఖ

వయనాడ్ : కేరళలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని న్యూఢిల్లీ హెచ్చరించిందంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యసభను తప్పుదోవ పట్టించారని పేర్కొంటూ సిపిఎం డిప్యూటీ లీడర్ జాన్ బ్రిట్టాస్, ఎంపీలు వీ శివదాసన్, ఏఏ రహీమ్ రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌కు లేఖ రాశారు. ఈ వ్యవహా రంలో రాజ్యసభ చైర్మన్ జోక్యం చేసుకుని వాస్తవ దశ్యాన్ని పార్లమెంట్ ముందుంచేలా హోంమంత్రికి సూచించాలని ఆ లేఖలో డిమాండ్ చేశారు. దుర్ఘటన జరిగిన ప్రాంతం ఒక్కసారి కూడా రెడ్ అలర్ట్ పరిధిలోకి రాలేదని ఎంపీలు తెలిపారు. 115 నుంచి 204 మిల్లీమీటర్ల వర్షపాతానికి ఆరెంజ్ అలర్ట్ మాత్రమే ఉంది. కానీ 200 మి.మీ నుంచి 372 మి.మీ వరకు వర్షం కురిసిందని వారన్నారు. విపత్తు తర్వాతే రెడ్ అలర్ట్ ప్రకటించారని, దీనిపై అమిత్ షా సభను తప్పుదోవ పట్టించారని ఆ లేఖలో స్పష్టం చేశారు. జూలై 23 నుంచి 28 వరకు కేంద్ర వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ కూడా జారీ చేయలేదు. జూలై 29 తెల్లవారుజామున 1 గంటలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. జూలై 30 ఉదయం 6 గంటలకు రెడ్ అలర్ట్ ఇచ్చారని అప్పటికే విషాదం నెలకొందన్నారు.

విపత్తు అనంతరం ఐఎండి హెచ్చరిక

వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన తర్వాత మధ్యాహ్నం 1.10 గంటలకు జులై 30న రెడ్ అలర్ట్ జారీ చేస్తున్నట్లు ఐఎండి తెలిపింది. జులై 31, ఆగస్టు 1వ తేదీలలో కేరళ, పుదుచ్చేరి ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొంది.

మధుర వివాదంలో మసీదు కమిటీ పిటీషన్ తిరస్కరణ

అలహాబాద్ : మధుర కృష్ణజన్మభూమి - షాహీ ఈద్గా వివాదంలో మసీదు కమిటీ పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు గురువారం తోసిపుచ్చింది. ఈ వివాదానికి సంబంధించిన ప్రధాన వ్యాజ్యం కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున ఈ పిటిషన్‌ను విచారించలేమని కోర్టు పేర్కొంది. ముస్లిం పక్షం పిటిషన్‌ను తిరస్కరిస్తూ.. గత రెండు దశాబ్దాలుగా ఈ వివాదంపై దాఖలైన 18 పిటిషన్లు నిర్వహించదగినవేనని, ముందుగా వాటి విచారణ పూర్తి చేయాల్సిన అవసరం ఉందని జస్టిస్ మయాంక్ కుమార్ జైనిస్ పేర్కొన్నారు. కాగా, ఈ పిటిషన్‌ల విచారణలో భాగంగా ఈద్గా మసీదుపై సర్వే చేపట్టాలంటూ ముగ్గురు సభ్యులతో గతేడాది హైకోర్టు ఒక కమిటీని నియమించింది. అయితే ఈ కమిటీపై సుప్రీంకోర్టు ఈనెల ప్రారంభంలో స్టే విధించిన సంగతి తెలిసిందే.

వయనాడ్ విషాదంపై
కేంద్రం దిగజారుడు రాజకీయాలు

- జాతీయ విపత్తును కేరళపై నెట్టేందుకు దుస్సాహసం
- పార్లమెంటు సాక్షిగా పచ్చి అవాస్తవాలు
- తిప్పికొట్టిన సిపిఎం సభ్యులు

న్యూఢిల్లీ : కనివిని ఎరుగని విపత్తు. ప్రకృతి ప్రకోపానికి నిద్రిస్తున్న ప్రజలు నిద్రిస్తున్నట్టే సజీవ సమాధి అయిన అత్యంత విషాద ఘటన. యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన విపత్తుపై కేంద్రంలోని మోడీ సర్కార్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోంది. పార్లమెంటు నిండు సభలో పచ్చి అవాస్తవాలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా వల్లె వేశారు. భారత వాతావరణ శాఖ (ఐఎండి) ద్వారా కొండ చరియలు విరిగిపడతాయని ముందే హెచ్చరించినా కేరళ ప్రభుత్వమే సరైన విధంగా స్పందించలేదంటూ అభాండాలు మోపారు. ఏ తరహా హెచ్చరికలు జారీ చేశారో చెప్పండంటూ ప్రతిపక్షాల సభ్యులు నిలదీయగా..అందుకు బదులిచ్చేందుకు ఆయన సిద్ధపడలేదు. పైగా విదేశీ మీడియా వెబ్‌సైట్లు చూసేవారు భారత ప్రభుత్వ వెబ్‌సైట్లు చూస్తే ఈ విషయం బోధపడుతుందంటూ ప్రతిపక్షాలపై అవమానకర వ్యాఖ్యలు చేశారు. కానీ అమిత్ షా ప్రకటన పూర్తిగా సత్యదూరమైనదని భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెబ్‌సైట్ చూస్తే స్పష్టమైపోతుంది. అమిత్ షా చెప్పినట్లుగా ఐఎండి జారీ చేసింది రెడ్ అలర్ట్ కాదు..లో-మీడియం (గ్రీన్), ఆరంజ్ అలర్ట్‌లు మాత్రమే. ఇందుకు సంబంధించిన వివరాలు ఐఎండి పోస్టు చేసిన హెచ్చరికల మ్యాప్ చూస్తే అర్థమవుతుంది. కానీ అమిత్ షా మాత్రం కేరళపై అభాండాలు మోపేశారు.

బాధ్యత నుంచి తప్పుకునేందుకే..అసత్యాలు

వయనాడ్ విపత్తుతో అతలాకుతలమైన కేరళకు ఊరటనిచ్చే ప్రకటన చేయాల్సిన బాధ్యత నుంచి తప్పుకునేందుకే అమిత్ షా ఆరోపణల దాడి వ్యూహాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోందని ప్రతిపక్షాలకు చెందిన పలువురు

సభ్యులు తెలిపారు. బుధవారం పార్లమెంటు ఉభయ సభల్లో వయనాడ్ విపత్తుపై ప్రత్యేక చర్చ నిర్వహించారు. ప్రతిపక్ష సభ్యులు పార్టీ రాజకీయాలకు అతీతంగా వయనాడ్ కొండచరియలను జాతీయ విపత్తుగా ప్రకటించి, కేరళకు ప్రత్యేక ఆర్థిక సహాయం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉభయ సభల్లో జరిగిన చర్చపై స్పందించిన అమిత్ షా.... ఈ రెండు డిమాండ్లపైనా వెనుదిరిగారు. బాధ్యతను విస్మరించి కాడి కిందకు పడేశారు. గత జులై 23 నుంచి 26 వరకు కేరళను హెచ్చరించినట్లు పేర్కొన్నారు. కొండచరియలు విరిగిపడే ప్రమాద హెచ్చరికలు కూడా జారీ చేశారని, జులై 23న తొమ్మిది ఎన్‌డిఆర్‌ఎఫ్ బందాలను కేరళకు పంపారని అమిత్ షా తెలిపారు. జులై 27, 28, 29 తేదీల్లో కేరళకు ఏం వార్నింగ్ ఇచ్చారో వివరించేందుకు హోంమంత్రి సిద్ధపడలేదు. ఉభయ సభల్లో చర్చలో పాల్గొన్న బిజెపి సభ్యులు కేరళకు సంఘీభావం తెలిపడానికి బదులు... ఈ అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నించారు. దీన్ని అమిత్ షా మరింతగా ప్రోత్సహించారు.

జాతియ విపత్తుగా ప్రకటించాలి
జాన్ బ్రిట్టాస్ డిమాండ్

రాజ్యసభలో జరిగిన చర్చలో పాల్గొన్న సిపిఎం ఉపనేత జాన్ బ్రిట్టాస్ వయనాడ్ కొండచరియల ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేరళకు ప్రత్యేక ఆర్థిక సహాయం కేటాయించాలి. కేరళలో ఎక్కువగా కొండచరియలు విరిగిపడతాయి. 2018లో వరదలు వచ్చినప్పుడు కేంద్రం అనుసరించిన విధానాన్ని పునరావతం చేయవద్దు. ఆ రోజు సైనికులు చేసిన సేవలకు కేరళ నుంచి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉచిత బియ్యాన్ని వసూలు చేశారని బ్రిట్టాస్ దష్టికి తీసుకెళ్లారు.

కొందరు సభ్యులు ఈ అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సిపిఎం ఎంపి వి శివదాసన్ అన్నారు. ఇలాంటి విధానం శోచనీయం. వారికి సరైన రాజకీయాలు తెలియవు. మానవత్వం లేదు. ప్రత్యేక సహాయానికి కేంద్రం సిద్ధంగా ఉండాలని శివదాసన్ అన్నారు. వాతావరణ హెచ్చరికల కోసం ఆధునిక రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎంపీ ఏఏ రహీమ్ పిలుపునిచ్చారు. వాయనాడ్‌తో సహా మలబార్‌లో రాడార్ వ్యవస్థ లేదు. కొచ్చి, తిరువనంతపురంలో ఉన్నా... ఆ వ్యవస్థ పాతదని రహీమ్ అన్నారు.

ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి: కె.రాధాకృష్ణన్

వయనాడ్ కొండచరియలు విధ్వంసాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని లోక్‌సభలో సిపిఎం ఎంపీ కె.రాధాకష్ణన్ డిమాండ్ చేశారు. వయనాడ్ విపత్తుకు సంబంధించి లోక్‌సభలో జరిగిన ప్రత్యేక చర్చలో రాధాకష్ణన్ పాల్గొన్నారు. వందలాది మంది మరణించారని, చాలా మంది అదశ్యమయ్యారు. ఈ విపత్తును పరిగణనలోకి తీసుకుని కేరళకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

పోస్టుమార్టం చేయలేక పారిపోవాలనుకున్నా

- వయనాడ్‌లో ఒక వైద్యురాలి భావోద్వేగం

తిరువనంతపురం : వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో శిథిలాలను తీస్తున్న కొద్దీ మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. దారుణ స్థితిలో ఉన్న మృతదేహాలను చూసి వైద్యులు కూడా వణికిపోతున్నారు. ఛిద్రమైన మృతదేహాలకు పోస్టుమార్టం చేయలేక పారిపోవాలనుకున్నట్లు ఓ ప్రభుత్వ వైద్యురాలు చెప్పడం అక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది. "ఎన్నో ఏళ్లుగా వైద్య వృత్తిలో ఉన్నా. ఎన్నో మృతదేహాలకు పోస్టుమార్టం చేశా. తాజాగా ఇక్కడ పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయి. ఓ శరీరం చూస్తే మొత్తం ఛిద్రమయ్యింది. రెండోదాన్ని చూడలేకపోయా. అది కూడా ఏడాది చిన్నారిది. అటువంటి మృతదేహాలు వరుసగా వస్తూనే ఉన్నాయి. అందులో అనేకం గుర్తించలేనంతగా ఉండటం కలచివేసింది. ఇక పోస్టుమార్టం చేయలేనని అనుకున్నా. ఆ ప్రాంగణం నుంచి బాధితుల సంరక్షణ కేంద్రానికి పారిపోదామనుకున్నా. కానీ, ప్రత్యామ్నాయం లేదు. అలా మొత్తంగా 18 మృతదేహాలకు శవపరీక్ష నిర్వహించా" అని వయనాడ్ ఘటన ప్రదేశంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ వైద్యురాలు భావోద్వేగంతో వివరించారు.

విలయానికి ముందు.. ఆ తర్వాత..

- ఇస్రో 'శాటిలైట్ చిత్రాలు

న్యూఢిల్లీ : భారీ వర్షాలకు కేరళలో వయనాడ్‌లో ఇటీవల సంభవించిన ఘటనలో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా అనేక మంది ఆ శిథిలాల కిందే చిక్కుకుపోయారు. కనీవినీ ఎరుగని ఈ విపత్తుకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) విడుదల చేసింది. అక్కడ సంభవించిన విలయాన్ని 3డీ రూపంలో చూపించింది.

86వేల చ.మీటర్లు..

కొండచరియలు విరిగిపడిన ఘటనలో దాదాపు 86వేల చ.మీటర్ల భూభాగం జారిపడిపోయినట్లు ఇస్రో అంచనా వేసింది. సముద్రమట్టానికి 1550 మీటర్ల ఎత్తులో ఈ కొండచరియలు విరిగిపడిన ప్రదేశాన్ని గుర్తించింది. ఇరువంజిపుళ నదిలో దాదాపు 8కి.మీ మేర ఈ శిథిలాలు కొట్టుకుపోతున్నట్లు సమాచారం. వయనాడ్‌లో చోటుచేసుకున్న భారీ వినాశనాన్ని అంచనా వేసేందుకు ఇస్రోకు చెందిన కార్టోశాట్-3, ఆర్ఐఎస్ఏటీ అత్యాధునిక ఉపగ్రహాలను నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్‌సిసి) ఆ ప్రాంతంలో అంతరిక్షం నుంచి తీసిన 3డీ చిత్రాలను విశ్లేషించింది. గతంలోనూ అదే ప్రాంతంలో కొండచరియలు విరిగిపడిన విషయాన్ని పేర్కొంది.

కేరళలో గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు వయనాడ్ ప్రాంతం మొత్తం తడిగా మారిపోయిందని అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ అట్మాస్ఫెరిక్ రాడార్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ నిపుణులు పేర్కొన్నారు. అరేబియా సముద్ర తీరంలో దట్టమైన మేఘాల ధోరణిని శాస్త్రవేత్తలు ముందుగానే గుర్తించారని అన్నారు. ఈ కారణంగా కేరళలో అతి తక్కువ వ్యవధిలో అత్యంత భారీ వర్షాలు పడి కొండచరియలు విరిగిపడే అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

విలయానికి ముందు...





విలయానికి తర్వాత...

పార్లమెంట్ లాబీలో వర్షపు నీరు

- వందలకోట్లు బూడిదలో పోసిన పన్నీరే
- బయటేమో పేపర్ లీకేజీ...లోపలేమో వాటర్ లీకేజీ.
- నూతన భవన నిర్మాణంపై ప్రతిపక్షాలు ఆగ్రహం
- పాత భవనంలోనే సమావేశాలు నిర్వహించాలని అఖిలేశ్ సూచన



న్యూఢిల్లీ : వందేండ్లు దాటిన పాత పార్లమెంట్ భవనం ఇప్పటికీ చెక్కుచెదర్లేదు. ఎన్డీఏ సర్కార్ వందలకోట్లు ఖర్చుపెట్టి హడావుడిగా కట్టిన నూతన పార్లమెంట్ భవనం లాబీలో వర్షపు నీరు కారుతోంది. సిబ్బంది బకెట్ పెట్టి .. ఆ నీటిని పారేస్తున్నారు. ఇప్పుడు వర్షపు నీరే కారుతోంది. మున్ముందు సమావేశమందిరాలు కాస్త స్విమ్మింగ్ పూల్స్‌గా మారటం ఖాయమన్న చర్చ నడుస్తోంది.

లీకేజీ వీడియో హల్‌చల్

పార్లమెంట్ లాబీలో నీరు లీకేజీ అవడం పాలక ఎన్డీఏను ఇబ్బంది పెడుతోంది. రాజధానిలో భారీ వర్షాలు పడుతుండడంతో పార్లమెంట్ లాబీలో నీరు చేరింది. దీనికి సంబంధించిన వీడియోను ప్రతిపక్ష కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల ఎంపీలు సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్‌రామ్ ఠాకూర్ లోక్‌సభలో వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నూతన పార్లమెంట్ భవనం నిర్మాణం కోసం బీజేపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందని, ఇప్పుడేమో వర్షపు నీరు పడుతోందని సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. సమావేశాలను పాత భవనంలోనే నిర్వహించాలని కోరారు.

బయటేమో పేపర్ లీకేజీ...లోపలేమో వాటర్ లీకేజీ.

'బయటేమో పేపర్ లీకేజీ...లోపలేమో వాటర్ లీకేజీ. రాష్ట్రపతి ఉపయోగించిన పార్లమెంట్ లాబీలో వర్షపు నీరు లీక్ కావడం చూస్తుంటే కొత్త భవనంలో వాతావరణ సంబంధమైన సమస్యలు ఉన్నాయని అర్థమవుతోంది. నూతన భవనం ప్రారంభించి కేవలం సంవత్సరం మాత్రమే అయింది' అని మాణిక్‌రామ్ ఠాకూర్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఎంపీ అఖిలేష్ యాదవ్ మరో అడుగు ముందుకు వేసి మిగిలిపోయిన వర్షాకాల సమావేశాలను పాత భవనంలో నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. 'దీని కంటే పాత పార్లమెంటే బాగుంది. అక్కడికి మాజీ ఎంపీలు కూడా వచ్చి కలిసేవారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి కట్టిన నూతన భవనంలో నీరు కారడం ఆగేంతవరకూ మనం పాత పార్లమెంటుకు ఎందుకు వెళ్లకూడదు?' అని ట్వీట్ చేశారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త పైకప్పు నుండి ఇలా నీరు కారడం వారి అద్భుతమైన ఆలోచనల రూపకల్పనలో భాగమేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని చమత్కరించారు.

రాజధానిలో గత 24 గంటల్లో 108 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గత 14 సంవత్సరాల్లో జూలై నెలలో ఒక రోజు ఈ స్థాయిలో వర్షపాతం నమోదు కావడం ఇదే మొదటిసారి. భారీ వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది. తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. నివాస ప్రాంతాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది.

ఇరవై వేల కోట్ల రూపాయల సెంట్రల్ విస్టా పునరభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నూతన పార్లమెంట్ భవనాన్ని నిర్మించారు. దీనిని గత సంవత్సరం మే 28న ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. దీని నిర్మాణానికి రూ.862 కోట్లు ఖర్చయ్యాయి. నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు బహిష్కరించిన విషయం తెలిసిందే.

ఎస్సీల్లో వెనుకబడిన సెక్షన్లకు మేలు చేకూర్చేలా చర్యలు

- ప్రభుత్వాలు తగు చొరవ చూపాలి
- సబ్‌కోటాను అనుమతిస్తూ సుప్రీం ఇచ్చిన తీర్పుపై సిపిఎం

న్యూఢిల్లీ : షెడ్యూల్డ్ కులాల్లో ఉప వర్గీకరణను, సబ్ కోటాను అనుమతిస్తూ ఏడుగురు సభ్యుల సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం 6-1 తేడాతో ఇచ్చిన మెజార్టీ తీర్పు వెలుగులో ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన సెక్షన్లకు మేలు చేకూర్చేలా ప్రభుత్వాలు తగు చర్యలు చేపట్టాలని సిపిఎం కోరింది. పార్టీ పొలిట్‌బ్యూరో గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. ఎస్సీ కేటగిరీలో అత్యంత వెనుకబడిన తరగతులకు విడిగా కోటా ఇచ్చుకోవడానికి సుప్రీం కోర్టు అనుమతించింది. ప్రభుత్వం చేసే ఉప వర్గీకరణ ఎస్సీల్లోని ఉప కులాలకు తక్కువ ప్రాతినిధ్యం ఉన్నట్టు శోధించి సేకరించిన డేటా ప్రాతిపదికన సముచితమైన రీతిలో ఉండేలా ప్రభుత్వం చూడాలని సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాన్ని పొలిట్‌బ్యూరో ఈ సందర్భంగా ఉటంకించింది.

ఎస్సీల్లోని వెనుకబడిన సెక్షన్ల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు అవసరమైన సుదపాయాలను ప్రభుత్వాలు ఇప్పుడు కల్పించాలి. ఎస్సీల్లోని బాగా వెనుకబడిన ఈ సెక్షన్ల అభ్యున్నతికి తోడ్పడేలా తగు చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వాలు కసరత్తు చేయాలని పొలిట్‌బ్యూరో ఆ ప్రకటనలో కోరింది.

భౌగోళిక స్వరూపం కారణంగానే కేరళలో అస్థిర వర్షాలు, విపత్తులు

న్యూఢిల్లీ: పర్యావరణ మార్పుల కారణంగా ఈశాన్య రుతుపవనాలు తమ స్వభావాన్ని మార్చుకున్నాయని, దీంతో దేశంలోని పలు ప్రాంతాలపై ప్రకృతి విపత్తులు విరుచుకుపడుతున్నాయని నిపుణులు తెలిపారు. ప్రత్యేక స్థానం, భౌగోళిక స్వరూపం కారణంగా కేరళ విపత్తులను ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. సముద్ర ఉపరితలం వేడెక్కడంతో అధిక శాతం తేమ, నీటి ఆవిరి అస్థిరమైన వర్షపాతాలకు ప్రధాన కారణమని, పెరుగుతున్న నీటి ఆవిరి అస్థిర వర్షపాతానికి దారితీస్తున్నాయని పేర్కొన్నారు. జులై 30న ఉదయం 8.30 గంటల వరకు 24 గంటల్లో కేరళలోని పలు ప్రాంతాల్లో (200మి.మీ లేదా 20 సెం.మీ) గరిష్ట వర్షపాతం రికార్డయింది. ఉదాహరణకు, త్రిస్సూర్‌లోని వడక్కన్‌చెర్రీలో 34 సెం.మీ, పాలక్కాడ్‌లోని అల్తూర్ 30 సెం.మీ, కొజిక్కోడ్‌లోని వడకరలో 28 సెం.మీ, వయనాడ్‌లోని వైత్రిరిలో 28 సెం.మీ వర్షపాతం నమోదైంది.

మొత్తంగా జూన్ నుండి కేరళలో సరైన వర్షాలు లేవు. జులై 30 నాటికి కేరళలో 5 శాతం లోటు వర్షపాతం రికార్డయింది. అయితే కేరళ తీరం వెంబడి చురుకైన ఉపరితల ద్రోణి, ఆగ్నేయ అరేబియా సముద్రం మరియు కేరళ తీరానికి ఆనుకుని ఉన్న లక్షద్వీప్ దీవుల మీదుగా తుఫాను విస్తరించడంతో గత రెండు రోజులుగా కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) పేర్కొంది. ఇది కేరళ తీరం వెంబడి మరియు నైరుతి, పశ్చిమ దిశగా (గంటలకు 45 కి.మీ వేగంతో) తేమ గాలులు వీస్తున్నాయని, పశ్చిమ కనుమలు భౌగోళిక మార్పులకు కారణమవుతున్నాయని తెలిపింది. ఇదే విధంగా 2019, 2021లోనూ కేరళలోని పలు ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదవడంతో వరదలకు దారితీసింది. కేరళలో గత దశాబ్దంలో 2018, 2019, 2021 మరియు ఈ ఏడాది తీవ్రమైన వరదలతో పాటు కొండ చరియలు విరిగి పడిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

ఆ ఉత్తర్వులు రద్దుచేయండి

- సిఎస్‌కు కేరళ సిఎం ఆదేశం

తిరువనంతపురం : విపత్తుల నిర్వహణ శాఖ జారీచేసిన ఒక ఉత్తర్వును తక్షణం రద్దు చేయాలని కేరళ సిఎం పినరయి విజయన్ ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. వాయనాడ్‌లోని విపత్తు ప్రాంతాన్ని శాస్త్ర, సాంకేతిక నిపుణులు కొంత కాలం సందర్శించకూడదని, సందర్శించినా వ్యాఖ్యానించకూడదంటూ ఆ రాష్ట్ర విపత్తుల నిర్వహణ అథారిటీ ఉత్తర్వులు జారీ చేసింది. సహాయ కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా నివారించడానికి ఈ ఉత్తర్వును జారీ చేసినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి విజయన్ దృష్టికి వెళ్లడంతో ఆ ఉత్తర్వులను తక్షణం రద్దు చేయాలని ఆదేశించారు. 'శాస్త్రవేత్తలకు, సాంకేతిక సంస్థలకు విపత్తుల నిర్వహణ అథారిటీ జారీ చేసిన ఆదేశాలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి. అటువంటి విధానం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు' అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సుప్రీం అనుమతి

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని వర్గాలను మాత్రమే గుర్తించి, వారికి ప్రాధాన్యత కోటాను ఇవ్వడంతో రాష్ట్రాలు ఎస్‌సి కులాల జాబితాను చేయలేవని పేర్కొన్నారు. కోటా మొత్తం ఎస్‌సి వర్గానికి సంబంధించినదని తెలిపింది. రాజకీయ కారణాలతో ఎస్‌సి జాబితాను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేదని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్‌సి కోటా రిజర్వేషన్లలో 50 శాతాన్ని వాల్మీకి, మజహబీ సిక్కు సామాజిక వర్గాలకు తొలి ప్రాధాన్యంగా ఇస్తూ 2006లో పంజాబ్ ప్రభుత్వం చట్టం చేసింది. ఎస్‌సి రిజర్వేషన్ల ఉప వర్గీకరణ చెల్లదంటూ పంజాబ్, హర్యానా హైకోర్టు 2010లో తీర్పు ఇచ్చింది. 2004లో ఇవి చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో సుప్రీం కోర్టు రాజ్యాంగం ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఉల్లంఘించేలా పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం చట్టం ఉందని హైకోర్టు పేర్కొంది. ఎస్‌సి కులాల జాబితాలో సామాజిక వర్గాన్ని చేర్చాలన్నా, తొలగించాలన్నా పార్లమెంట్‌కు మాత్రమే అధికారం ఉందని, రాష్ట్రాల అసెంబ్లీలకు లేదని 2004లో తీర్పు చెప్పింది. ఆ తీర్పునే హర్యానా, పంజాబ్ హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌తో సహా 23 పిటిషన్లను 2020లో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించి, ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి రిఫర్ చేసింది. ఎస్‌సి, ఎస్‌టి వర్గాలను రాష్ట్రాలు వర్గీకరించలేవని ఈవి చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్‌లో కేసులో 2004లో తీర్పును పున్ససమీక్షించాలని పేర్కొంది. అప్పుడు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసును విచారించింది.

ఏపి, తెలంగాణలో ఇలా

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాల మాదిగల్లో మాలలే ఎక్కువ అవకాశాలు దక్కించుకుంటున్నారనే ఆరోపణలతో ఎంఆర్‌పిఎస్ ఉద్యమం ఆవిర్భవించింది. 2011 నాటికి ఉమ్మడి ఏపిలో 1.34 కోట్ల మంది ఎస్‌సిల్లో 66 లక్షల మాదిగలు, 54 లక్షలు మాలలు ఉండేవారని ఉద్యోగాల్లో మాత్రం మాదిగలకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదనేది ఎంఆర్‌పిఎస్ వాదనగా ఉండేది.

ఏబిసిడిలుగా వర్గీకరణ

1997లో జరిగిన ఎస్‌సి వర్గీకరణలో ఎస్‌సిలను ఏ, బి, సి, డిలుగా వర్గీకరించారు. కేటగిరీ ఏ-లో రెల్లితో పాటు 12 ఉపకులాలకు 1 శాతం, బి కేటగిరీలో మాదిగలతో పాటు 18 కులాలకు 7 శాతం, సి కేటగిరీలో మాలలతో పాటు 25 ఉపకులాలకు 6 శాతం, డి కేటగిరీలో ఆది ఆంధ్రులతో పాటు మరో నాలుగు కులాలకు 1శాతం రిజర్వేషన్ కల్పించారు.

వయనాడ్‌కు అండగా నిలుద్దాం

ప్రకృతి విలయానికి వయనాడ్ అతలాకుతలం అయ్యింది. ఈ నేపథ్యంలో వరద ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు పలువురు నటీనటులు ముందుకొచ్చారు. సూర్య, జ్యోతిక, కార్తి కలిసి రూ.50 లక్షలను కేరళ సీఎం సహాయనిధికి విరాళంగా ఇచ్చారు.ఈ ఘటన తననెంతో కలచి వేసిందని సూర్య ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 'ఇది హృదయ విదారక ఘటన. రెస్క్యూ ఆపరేషన్ ద్వారా సాయం చేస్తోన్న వారందరికీ ధన్యవాదాలు. ప్రమాదంలో మృతి చెందిన వారికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా' అని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై మలయాళ చిత్ర పరిశ్రమ కూడా విచారం వ్యక్తం చేసింది. కొన్ని రోజుల పాటు సినిమా ఫంక్షన్లు, కార్యక్రమాలు నిలిపివేస్తున్నట్లు పలు మూవీ యూనిట్లు వెల్లడించాయి.

వయనాడ్ బాధితులకు విక్రమ్ సాయం

కేరళ రాష్ట్రం వయనాడ్‌లో వరదల్లో చనిపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు కోలీవుడ్ హీరో చియాన్ విక్రమ్ రూ.20 లక్షలు విరాళాన్ని ప్రకటించారు. కొండచరియలు విరిగిపడటంతో సుమారు 150 మందికిపైగా మృతి చెందారు. వందలాదిమంది తీవ్రంగా గాయపడ్డారు. శిథిలాల కింద చాలామంది ఇరుక్కుపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాధితుల సహాయార్థం కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి విక్రమ్ ఈ మొత్తాన్ని ప్రకటించారు. ఈ విషయాన్ని విక్రమ్ మేనేజర్ యువరాజ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

అశ్విన్‌బాబు న్యూలుక్ విడుదల

అశ్విన్ బాబు హీరోగా ఓ ప్రాజెక్టు తెరకెక్కుతోంది. మెడికో థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి మామిడాల ఎం.ఆర్. కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అరుణశ్రీ ఎంటర్టైన్మెంట్స్ ప్రొడక్షన్ నెంబర్ 3గా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. నిర్మాత టి. గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. ఆగష్టు 1, అశ్విన్ బాబు పుట్టిన రోజు సందర్భంగా, చిత్ర యూనిట్ అశ్విన్ బాబుకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ తాజాగా ఓ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. ఈ చిత్రంలో అశ్విన్ బాబుకి జోడిగా రియా సుమన్ నటిస్తున్నారు. అయేషా ఖాన్, మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్, అజయ్, గణేష్, యెష్నా చౌదరి, సుదర్శన్, శకలక శంకర్, రాఘవ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం హైదరాబాద్, వైజాగ్, కొడయ్ కెనాల్ ల్లో 75 శాతం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సంవత్సరం చివరిలో ప్రేక్షకులు ముందుకి రాబోతుంది. ఈ సినిమాకి టాప్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. గౌర హరి మ్యూజిక్ అందిస్తున్నారు.

చెక్ బౌన్స్ కేసులో చెన్నై హైకోర్టు కీలక ఆదేశాలు

చెక్కు బౌన్స్ కేసులో 'కొచ్చడైయాన్' సినిమా నిర్మాతకు గతేడాదిలోనే ఆరునెలల జైలు శిక్షకు చెన్నై అదనపు సెషన్ కోర్టు విధించింది. డబ్బు చెల్లించేందుకు కొంత సమయాన్ని కోర్టు ఇచ్చింది. రజనీకాంత్ హీరోగా ఆయన కూతురు సౌందర్య దర్శకత్వంలో 2014లో వచ్చిన 3డీ మోషన్ క్యాప్చర్ మూవీ 'కొచ్చడైయాన్'. ఈ సినిమా నిర్మాణానికి బెంగుళూరుకు చెందిన యాడ్ బ్యూరో అడ్వర్టైజింగ్ ప్రయివేటు లిమిటెడ్ నుంచి మీడియా వన్ గ్లోబల్ ఎంటర్టైన్‌మెంట్ లిమిటెడ్ అధినేతల్లో ఒకరైన మురళీ మనోహర్ రూ.10 కోట్లు రుణాన్ని తీసుకున్నారు. అందుకు లతా రజనీకాంత్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. నిర్మాత మురళీమనోహర్ 2014లో రూ.5 కోట్లను ఇచ్చారు. అయితే ఆ చెక్కు బౌన్స్ అయ్యింది. దీంతో నిర్మాతపై చెన్నై అల్లికుళంలో ఉన్న కోర్టులో మోసం కేసు దాఖలు చేశారు. అబిర్‌చంద్ సహర్‌కి ఇవ్వాల్సిన రూ.5 కోట్లకు ఏడాదికి 9 శాతం వడ్డీ చొప్పున రూ.7.70 కోట్లు ఇవ్వాలని కోర్టు తీర్పునిచ్చింది. ఆ డబ్బు చెల్లించేందుకు నిర్మాత అంగీకరించటంతో బెయిల్ మంజూరు చేయటంతో పాటు ఈ కేసులో స్టే విధించింది. నేటికీ తనకు రావాల్సిన పూర్తి సొమ్ము అందలేదని అభిరచంద్ సహర్ మళ్లీ కోర్టును ఆశ్రయించారు. వడ్డీ కాకుండా అసలుకు సంబంధించే రూ.కోటి ఇవ్వాల్సివుందని ఆయన పేర్కొన్నాడు. ఈ విషయమై విచారించిన కోర్టు ఈ మొత్తాన్ని నాలుగు వారాల్లో చెల్లించకోతే బెయిల్ రద్దుచేస్తామని హెచ్చరించింది. కోర్టు తీర్పును ధిక్కరిస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించింది.

సత్తాచాటిన స్వప్నిల్

పొజిషన్-3 షూటింగ్‌లో 7వ స్థానంతో ఫైనల్‌కు చేరినా.. కాంస్య పతకం కైవసం
పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు మూడో పతకం

పారిస్: 2024 పారిస్ ఒలింపిక్స్‌లో భారత షూటర్లు మరో పతకాన్ని చేజిక్కించుకున్నారు. ఈ ఒలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్న షూటర్లు.. మూడో కాంస్య పతకాన్ని చేజిక్కించుకున్నారు. మను భాకర్ 'డబుల్ మెడల్' ఇచ్చిన స్ఫూర్తితో గురువారం జరిగిన పురుషుల పొజిషన్ 3 షూటింగ్‌లో యువ షూటర్ స్వప్నిల్ కాంస్య పతకంతో మెరిసాడు. మూడు పొజిషన్ల షూటింగ్ అంటే.. బోర్లా పడుకొని(ప్రోన్), మోకాళ్ల మీద(నీలింగ్), నిల్చొని(స్టాండింగ్) షూటింగ్ చేయాల్సి ఉంటుంది. స్వప్నిల్ మోకాళ్లపై షూటింగ్‌లో 153.5 పాయింట్లు, ప్రోన్ విభాగంలో 156.8 పాయింట్లు, స్టాండింగ్‌లో 141.1 పాయింట్లను (స్టేజ్ 2 ఎలిమినేషన్‌తో సహా) మొత్తం 451.4 పాయింట్లు సాధించాడు. దీంతో స్వప్నిల్ కుశల్ మూడో స్థానంలో నిలిచాడు. తొలుత నెమ్మదిగా ప్రారంభించిన స్వప్నిల్.. కీలక సమయంలో అద్భుతంగా పుంజుకొన్నాడు. ఒక దశలో నాలుగు, ఐదు స్థానాలకే పరిమితమైన స్వప్నిల్... క్రమంగా టాప్-3లోకి ఎగబాకాడు. ఆ తర్వాత ఏ మాత్రం వెనక్కి తిరిగిచూడలేదు. చివరికి 451.4 పాయింట్లను సాధించి కాంస్యం చేజిక్కించుకున్నాడు. చైనాకు చెందిన లి యుకున్(463.6) స్వర్ణం, ఉక్రెయిన్ షూటర్ కులిష్ సెర్హియ్(461.3) రజత పతకాలు కైవసం చేసుకున్నారు. బుధవారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో 590 పాయింట్లు సాధించిన స్వప్నిల్.. ఏడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించిన సంగతి తెలిసిందే. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఎక్కువ సంఖ్యలో పది పాయింట్లు కొట్టడంతో స్వప్నిల్‌కు ఫైనల్ బెర్త్ దక్కింది. దీంతో పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య మూడుకు చేరింది.

నిఖత్ జరీన్ ఔట్

భారత్‌కు పతకాలు దక్కే ఈవెంట్‌లలో బాక్సింగ్ ఒకటి. గురువారం జరిగిన మహిళల 50 కిలోల బాక్సింగ్ విభాగంలో నిఖత్ జరీన్.. ఆసియా స్వర్ణ పతక విజేత, చైనాకు చెందిన వూ యూ చేతిలో ఓటమిపాలైంది. ప్రి క్వార్టర్స్‌లో 5-0 తేడాతో నిఖత్ బాక్సింగ్ బౌట్‌ను కోల్పోయింది. పారిస్ ఒలింపిక్స్‌లో అన్‌సీడెడ్‌గా నిఖత్ బరిలోకి దిగింది. ఈ బౌట్‌లో నిఖత్ పంచ్‌లను ఆశించిన స్థాయిలో కొట్టలేకపోయింది. ఇక 52 కిలోల ఫ్లయ్‌వెయిట్‌లోనూ ప్రపంచ చాంపియన్ అయిన చైనా క్రీడాకారిణి.. బౌట్ మొత్తం ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మెగా గేమ్స్‌లో మెడల్ సాధిస్తుందని అనుకున్నా.. నిఖత్‌కు రెండో రౌండ్‌లోనే బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవాల్సి వచ్చింది. తొలి రౌండ్‌లో జర్మనీ బాక్సర్ మాక్సీ కరీనా కోయిజర్‌పై నిఖత్ గెలుపొంది రెండోరౌండ్‌కు చేరింది.

హాకీలో వరుస విజయాలకు బ్రేక్..

పారిస్ ఒలింపిక్స్ భారత హాకీ జట్టు వరుస విజయాలకు బ్రేక్ పడింది. గురువారం జరిగిన గ్రూప్-బి లీగ్ పోటీలో డిఫెండింగ్ ఛాంపియన్ బెల్జియం చేతిలో భారత్ 2-1 తేడాతో ఓటమి పాలైంది. ఆరంభంలో భారతజట్టు ఆధిక్యంలో ఉన్నా.. టోక్యో స్వర్ణ పతక విజేత బెల్జియం అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించింది. భారత్ తరపున అభిషేక్ ఒక్కడే ఇక గోల్ చేశాడు. బెల్జియం తరపున స్టాక్‌బ్రోక్స్(33వ ని.), జాన్ డోమన్(44వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. తొలి రెండు క్వార్టర్లలో భారత్ దూకుడు ప్రదర్శించినా.. కీలకమైన చివరి రెండు క్వార్టర్స్‌లో బెల్జియం ఆటగాళ్లు జోరు పెంచారు. రాజ్ కుమార్ పాల్‌కు ఎల్లో కార్డు ఇవ్వడం వల్ల.. చివరి నిమిషాల్లో ఒక ఆటగాడు లేకుండానే భారత్ ఆడాల్సి వచ్చింది. ఈ ఓటమితో భారత్ 4 మ్యాచ్‌లు ముగిసేసరికి 7పాయింట్లతో మూడోస్థానంలో నిలిచింది. నేడు జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు ఆస్ట్రేలియాతో తలపడనుంది.

లక్ష్యసేన్ ముందుకు...
చిరాగ్-సాత్విక్, సింధు ఓటమి

బ్యాడ్మింటన్ విభాగంలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ క్వార్టర్స్‌కు చేరగా.. మహిళల సింగిల్స్‌లో పివి సింధు, పురుషుల డబుల్స్‌లో చిరాగ్-సాత్విక్ జోడి ఓటమిపాలయ్యారు. గురువారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్ 21-12, 21-6తో భారత్‌కే చెందిన హెచ్ఎస్ ప్రణయ్‌పై గెలిచాడు. ఇక పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ 21-13, 14-21, 16-21తో మలేషియా జంట చేతిలో ఓడారు. ఇక ప్రి క్వార్టర్స్‌లో సింధు 19-21, 14-21తో 6వ సీడ్ హి-బింగ్జియావో(చైనా)చేతిలో ఓడింది.

పతకాల్లో చైనా అగ్రస్థానంలోనే..

పారిస్ ఒలింపిక్స్ పతకాల సాధనలో కమ్యూనిస్టు చైనా తన ఆధిపత్యాన్ని ఆరో రోజూ కొనసాగించింది. ఒలింపిక్స్ ప్రారంభం నుంచి ప్రతి రోజూ పతకాల పట్టికలో చైనా అగ్రస్థానంలోనే నిలుస్తోంది. ఆరోరోజు పోటీలు ముగిసే సమయానికి చైనా 11స్వర్ణ, 7రజత, 5కాంస్యాలతో సహా మొత్తం 23 పతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మరోవైపు టోక్యో ఒలింపిక్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన అమెరికా నేటికీ 5వ స్థానంలోనే ఉంది. ఆరో రోజుకు అమెరికా 7స్వర్ణ, 14రజత, 13కాంస్యా లతో సహా 34 పతకాలతో 4వ స్థానంలో ఉంది. అథ్లెటిక్స్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్ విభా గాల్లో అమెరికాకు, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో చైనాకు మరిన్ని పతకాలు దక్కే ఛాన్స్ ఉంది. ఈ క్రమంలో చైనా-అమెరికాల మధ్య పతకాల సాధన, అగ్రస్థానంపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది.

రోహిత్, కోహ్లి చేరిక

- నేడు శ్రీలంకతో తొలి వన్డే
- మ.2.30గం॥ల నుంచి

కొలంబో: టి20 సిరీస్ నెగ్గిన ఉత్సాహంలో ఉన్న టీమిండియా.. ఇక శ్రీలంకతో వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారతజట్టు టి20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేయగా.. వన్డే సిరీస్‌కు టి20 ప్రపంచకప్ సాధించిన రోహిత్ శర్మ అందుబాటులోకి వచ్చాడు. అలాగే విరాట్ కోహ్లి కూడా జట్టుతో కలవడంతో భారత బ్యాటింగ్ ఆర్డర్ మరింత పటిష్టంగా మారింది. మరోవైపు శ్రీలంక టి20 సిరీస్‌ను కోల్పోయినా.. స్వదేశంలో కనీసం వ్డే సిరీస్‌ను అయినా నెగ్గాలనే దృఢ సంకల్పంతో బరిలోకి దిగుతోంది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ప్రాక్టీస్ లేకుండానే బరిలోకి దిగుతున్నారు.

జట్లు....

ఇండియా: రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, కోహ్లి, కెఎల్ రాహుల్, పంత్(వికెట్ కీపర్), దూబే, అక్షర్, కుల్దీప్, సిరాజ్, అర్ష్‌దీప్, ఖలీల్ అహ్మద్, సుందర్, రియాన్ పరాగ్, హర్షిత్ రాణా.

శ్రీలంక: అసలంక(కెప్టెన్), నిస్సంక, ఫెర్నాండో, కుశాల్ మెండీస్(వికెట్ కీపర్), సమరవిక్రమ, లైనగే, వెల్లలిగే, హసరంగ, తీక్షణ, అసితా, షిరాజ్, కరుణరత్నే, ధనుంజయ, కమిందు, మధుశంక, మలింగ.

పతకాల పట్టిక(టాప్-10)

దేశం	స్వ	ర	కా	మొ
1. చైనా	11	7	5	23
2. ఫ్రాన్స్	8	10	8	27
3. జపాన్	8	3	5	16
5. అమెరికా	7	14	13	34
4. ఆస్ట్రేలియా	7	6	4	17
5. బ్రిటన్	6	7	7	20
6. ద.కొరియా	6	3	3	12
7. ఇటలీ	5	6	4	15
9. కెనడా	3	2	3	8
10. జర్మనీ	2	2	2	6
44. ఇండియా	0	0	3	3

గమనిక: స్వ:స్వర్ణం, ర:రజతం; కా:కాంస్యం; మొ:మొత్తం

మీకోసం

బాగా జిడ్డు పేరుకుపోయిన ఇనుప పెనాన్ని పొయ్యి మీద పెట్టి, సాల్ట్ వేసి బాగా వేడిచేయాలి. ఒక గరిటెతో ఉప్పనంతటినీ పెనం మీద పేరుకుపోయిన జిడ్డుతో కలిపి గట్టిగా తిప్పుతూ ఉండాలి. కాసేపటికి నల్లని జిడ్డంతా పెచ్చుపెచ్చులుగా ఊడిపోతుంది. ఇలా రెండు మూడు సార్లు చేస్తే, పెనం చక్కగా శుభ్రపడుతుంది.

జీవన సౌరభం

గెలవకపోవడం ఓటమి కాదు. మళ్లీ ప్రయత్నించకపోవడమే ఓటమి.

JEEVANA జీవన the family

ఉత్తరమమ్మా.. ఉత్తరం!

ఉత్తరమమ్మా.. ఉత్తరం
ఉభయ కుశలోపరి ఉత్తరం

అక్షరాల అల్లిక ఉత్తరం
తోకలేని పిట్ట ఉత్తరం
సమాచారం అందించే సాధనం
మంచి చెడు విషయాల సంగమం
కనుమరుగవుతున్న ఉత్తరం!

ఉత్తరమమ్మా.. ఉత్తరం
ఉభయ కుశలోపరి ఉత్తరం

సమాచార విప్లవ ఫలితం
ఉత్తరాలు రాసేవారు శూన్యం!
సెల్ ఫోన్‌లో ఎస్ఎంఎస్,
వాట్సాప్‌ల ప్రవేశం
ఉత్తరాలు రాయడమే గగనం
ఉత్తరాలు చదివే వారు శూన్యం!

ఉత్తరమమ్మా.. ఉత్తరం
ఉభయ కుశలోపరి ఉత్తరం

– ఏడుకొండలు కళ్ళేపల్లి,
మచిలీపట్నం,
94908 32338.

ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి కింద వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.



నేను గీసిన బొమ్మ

వై.ఉన్నతి,
5వ తరగతి,
జెమినీ స్కూల్,
గుంటూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చీకట్లో చిరుదివ్వె నా పాప..

బిడ్డ పుట్టుక ప్రతి తల్లికీ ఓ మధుర క్షణం. ప్రసవ వేదన ఎంత వేధిస్తున్నా ప్రతి నొప్పినీ సంతోషంగా భరిస్తుంది. బిడ్డకు జన్మనిస్తుంది. కానీ ఓ తల్లికి ఆ క్షణం తలచుకుంటేనే వెన్నులో వణుకుపుడుతోంది. ఆ ఆనందాన్ని ఎవరితోనైనా పంచుకోవాల్సివస్తే ఆమె కళ్లు సిగ్గుతో తలవాల్చేస్తాయి. అంత బిడియపడాల్సిన పరిస్థితి ఆ తల్లికి ఎందుకు వచ్చిందంటే.. ఆమె గాజా తల్లి ఆలా. ఇజ్రాయిల్ దాడిలో నిరాశ్రయులైన లక్షలాది మందిలో ఆమె ఒకటి. అర్ధరాత్రి ప్రసవ నొప్పులు మొదలైతే ఆదరించే వారు లేక, ఆశ్రయం ఇచ్చేవారు కనిపించక, నడిరోడ్డు మీదే పిల్లని కనింది. అంబులెన్స్ కోసం దూరంగా వేచిఉన్న తండ్రి ఒక్క క్షణం ఆలస్యం చేసినా ఆ బిడ్డ ప్రాణాలతో ఉండేది కాదు. 'బిడ్డ కింద పడిపోతుంద'ని భయంతో ఆలా చేసిన ఆర్తనాదంతో అతను ఒక్క ఉదుటున అక్కడికి వచ్చాడు. రోడ్డు మీద పడిపోతున్న బిడ్డ తలని జాగ్రత్తగా పట్టుకున్నాడు. చిమ్మ చీకటి, భరించలేని చలిలో అలా, ఆలా ఆ బిడ్డకి జన్మనిచ్చింది.

ఇప్పుడు ఆలా కూతురు నిమర్‌కి ఆర్నెళ్లు.. ఆ పిల్లకి తిండి సంగతి అటుంచితే, ఒళ్లు తడుపుకోవడానికి కాసిన్ని నీళ్లు దొరకని పరిస్థితిలో ఆలా ఉంటోంది. ఆ చుట్టుపక్కల ఎక్కడా ప్రవహించే నీరు లేదు. చుట్టాలు, బంధువుల ఇళ్ల నుండి సేకరించిన కొంచెం నీటితో ఇల్లు గడుపుకోవాలి. 'ఆ నీళ్లు తాగడానికే అంతంతమాత్రం ఉంటే ఇక పిల్లల స్నానాలకు ఎలా వస్తాయి. అయినా నిమర్‌కి, రోజూ ఎప్పుడు స్నానం చేయిస్తానా అని ఎదురుచూడడంతోనే నా రోజు తెల్లారుతుంది' అంటోంది ఆలా.

గాజాపై ఇజ్రాయిల్ దాడులు మొదలుపెట్టినప్పటి నుండి ఆలా కుటుంబం ఇప్పటికి 11 సార్లు వేర్వేరు ప్రాంతాల్లో తలదాచుకుంది. 'మొట్టమొదటిసారి గాజా సిటీలోని జియోటౌన్‌పై ఇజ్రాయిల్ తెగబడినప్పుడు మా బంధువుల ఇంట్లో తలదాచుకున్నాం. ఇప్పుడు ఇరుగుపొరుగు ఇళ్లకు మారుతూ ఉన్నాం. మొదట మేము సురక్షిత ప్రాంతానికి వెళ్లాలనుకున్నాం. కానీ గాజా ఉత్తర సరిహద్దు నుండి దక్షిణం వరకు ఏ ప్రాంతమూ సురక్షితంగా లేదు. ఒకసారి మేము తలదాచుకున్న భవంతిపై ఇజ్రాయిల్ యుద్ధ ట్యాంకర్ బాంబులు విసిరింది. అయితే ఆ బాంబు వల్ల ఏర్పడ్డ అతిపెద్ద సొరంగం వల్ల అక్కడ ఆశ్రయం పొందుతున్న 25 మందిమి బతికిబయటపడ్డాం. అప్పటికి నిమర్ కడుపులోనే ఉంది. పెద్ద పిల్లలు ఇద్దరూ నా దగ్గర ఉన్నారు. తన తల్లికి ఆరోగ్యం బాగోలేదని నాభర్త ఆమెతో వేరే చోట ఉన్నాడు. నేనొక్కదాన్నే ఇద్దరు బిడ్డలతో, నిండు నెలలతో 4 గంటలు నడుచుకుంటూ ఓ మసీదులో తలదాచుకున్నాను.

బిడ్డ పుట్టుక ఓ భయంకర అనుభవం

'రెండు నెలల తరువాత ఓ అర్ధరాత్రి నాకు నొప్పులు మొదలయ్యాయి. కానీ అవి నిజం కావొద్దని ప్రార్థించాను. ఎందుకంటే ఆ పరిస్థితుల్లో కనడం నాకిష్టం లేదు. సురక్షితంగా ఆస్పత్రిలో ప్రసవించాలనుకున్నాను. కానీ, ఆ అర్ధరాత్రి, జనవరిలో ప్రసవ నొప్పులు మొదలయ్యాయి. మేమంతా అంబులెన్స్ కోసం రోడ్డు మీదకి వచ్చాం. బాగా పొద్దుపోవడంతో ఎవరూ రావడం లేదు. ఈలోపు నొప్పులు ఎక్కువయ్యాయి. నా దగ్గర ఎవరూ లేరు. అంబులెన్స్ కోసం తలోదిక్కూ వెళ్లిపోయారు. ఈలోపే ప్రసవం మొదలైపోయింది. నా భర్త ఒక్క క్షణం ఆలస్యంగా వచ్చి ఉంటే నిమర్ మాకు దక్కేది కాదు. అంత ప్రమాదకరంగా ప్రసవించాను. ఎలాగోలా అంబులెన్స్‌ని పిలిపించి నన్ను, అమ్మని, బిడ్డని కారు ఎక్కించారు. నా భర్త, కారు వెనక పరుగెత్తడం నాకింకా గుర్తు. అలా కొంతదూరం వెళ్లేసరికి ఇంధనం అయిపోయి అంబులెన్స్ ఆగిపోయింది. అప్పటికే నాకు అధిక రక్తస్రావం అవుతోంది. మా అమ్మ నా దగ్గర కూర్చొని ఒకటే ఏడుస్తోంది. మధ్య మధ్యలో కారు దిగి, 'మమ్మల్ని రక్షించడానికి ఎవరైనా ఉన్నారా? ఇక్కడ, ఓ పక్క నా బిడ్డ ఇప్పుడే ప్రసవించింది. ప్రమాదకర పరిస్థితిలో ఉంది. ఆమె ప్రసవించిన నవజాత శిశువు చలితో ఉక్కిరిబిక్కిరి అవుతోంది' అని అరుస్తున్నా ఎవరూ రాలేదు. అక్కడి నుండి మేమంతా ఓ గంట నడుచుకుంటూ వెళ్లి ఓ మినీబస్సును పట్టుకుని ఆస్పత్రికి వెళ్లాం. నా ప్రాణం కంటే నిమర్ బతుకుతుందో లేదోనని చాలా కంగారుపడ్డాను. ఆ చలిలో అంతలా బిగుసుకుపోయింది. తెల్లవారే వరకు క్షణం క్షణం భయం భయంగా గడిపాను' అని ఆనాటి సంఘటనను ఆలా గుర్తుచేసుకుంది.

'నిమర్ పుట్టే సమయానికే ఇజ్రాయిల్ దాడులు ముగిసిపోతాయని భావించాను. కానీ ఇప్పటికీ సమసిపోలేదు. బిడ్డకి కడుపునిండా పాలు పట్టలేకపోతున్నాను. పిల్లలకి తిండి లేదు, నీళ్లు లేవు, ఈ దారుణమైన పరిస్థితి ఇంకెన్నాళ్లు? అయినా ఇంత విషమపరిస్థితుల్లో కూడా నా కూతురు చిరునవ్వే నేను జీవించేలా చేస్తుంది' అని బిడ్డ తలని ప్రేమతో నిమురుతూ చెబుతోంది ఆలా.

ఒకపక్క బిడ్డలను పోగొట్టుకున్న తల్లుల రోదనలు, మరోపక్క, పిల్లలకు కడుపునిండా తిండి తినిపించలేని నిస్సహాయత తల్లులు ఇప్పుడు గాజాలో ఎక్కడ చూసినా కనిపిస్తున్నారు. అక్టోబరు 7న మొదలైన ఇజ్రాయిల్ దాడిలో ఇప్పటి వరకు 39 వేల పైచిలుకు గాజా పౌరులు మరణించారు. వారిలో ఆలా తమ్ముడు కూడా ఉన్నాడు. యుద్ధాలు, ప్రకృతిప్రకోపాలు కుటుంబాలను ఎలా విచ్ఛిన్నం చేస్తాయో అనడానికి ఆలా జీవితం ఓ ఉదాహరణ.

అత్తి పండు.. ఆరోగ్యం మెండు..

అత్తి పండ్లలో (అంజీర పండ్లు) ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. వాటిని తాజాగా లేదా ఎండబెట్టి లేదా ఇతర రూపాల్లో కూడా తినవచ్చు. వీటిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. అలాగే ఆరోగ్యకరమైన పేగు వ్యవస్థను ప్రోత్సహిస్తుంది. వీటిలో విటమిన్లు ఎ, బి, కె, అలాగే పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు కూడా అధికంగా ఉంటాయి.

జీర్ణ ఆరోగ్యం : వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉండడం వల్ల ఇజీర్ణక్రియకు సహాయపడుతుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. వీటిలో ప్రీబయోటిక్స్ కూడా ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన గట్ బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తాయి.

గుండె ఆరోగ్యం : ఈ పండ్లలో ఉండే పొటాషియం, మెగ్నీషియం రక్తపోటును నియంత్రించడానికి అలాగే గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి సహాయపడతాయి. యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటం వల్ల మంటను తగ్గించడానికి, గుండె జబ్బుల నుండి రక్షించడానికి సహాయపడతాయి.

ఎముకల ఆరోగ్యం : ఈ పండ్లు కాల్షియానికి మంచి మూలం. వీటిలో ఉండే విటమిన్ కె ఎముక జీవక్రియలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇంకా బోలు ఎముకల వ్యాధిని నివారించడంలో సహాయపడుతుంది.

బరువు నిర్వహణ : అత్తి పండ్లు తక్కువ కేలరీలు, పోషకాలు అధికంగా ఉండే ఆహారం.

గర్భిణీలకు ఆరోగ్య ప్రయోజనాలు : గర్భిణీలు అంజీర పండ్లను తినడం ద్వారా అనేక ప్రయోజనాలను పొందవచ్చు. పిండం అభివృద్ధికి చాలా అవసరమైన ఫోలేట్ ఈ పండ్లలో లభిస్తుంది. పుట్టుకతో వచ్చే లోపాలను నివారించడంలో సహాయపడుతుంది. అత్తి పండ్లలోని ఐరన్ గర్భధారణ సమయంలో రక్తహీనతను నివారించడంలో కూడా సహాయపడుతుంది. శిశువు ఎముకలు, దంతాల అభివృద్ధికి ఎంతగానో సహాయపడుతుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68